CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 79 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | మంగళవారం 25 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :79 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | TUE 25 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# కుటుంబ సమగ్ర సమాచారంతో స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్...

- రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ జారీకి నిర్ణయం
- ఒకే కార్డుతో ప్రభుత్వ పథకాలు, పౌర సేవల పర్యవేక్షణ
- రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్ ద్వారా వివరాల సేకరణ
- ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వచ్చే ఏడాది జూన్ నాటికి 1.4 కోట్ల కార్డుల జారీ లక్ష్యం




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో సుపరిపాలన అందించే దిశగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సేవలను మరింత పారదర్శకం గా ప్రజలకు చేరవేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన అడుగు ముందుకు వేసింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి, వారి సమగ్ర సమాచారంతో కూడిన 'స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్'ను జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్ మెంట్ సిస్టం' (ఎఫ్‌బీఎంఎస్) అమలు ద్వారా కుటుంబ సాధికారిత సాధించాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నాడు సచివాలయంలో ఎఫ్‌బీఎం ఎస్‌పై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పౌర సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి,

వివరాలు 2లో..

# ఇక సెలవు

**ముగిసిన ధర్మేంద్ర అంత్యక్రియలు... అశ్రునయనాల మధ్య నట దిగ్గజానికి తుది వీడ్కోలు**



- బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర అంత్యక్రియలు పూర్తి
- ముంబైలో అనారోగ్యంతో 89 ఏళ్ల వయసులో కన్నుమూత
- అంతిమ యాత్రకు తరలివచ్చిన అమితాబ్, అమీర్ ఖాన్
- ఆయన మరణించిన రోజే 'ఇక్కీస్' చిత్రం పోస్టర్ విడుదల
- భారత సినీ పరిశ్రమకు తీరని లోటన్న ప్రముఖులు

వివరాలు 2లో..



# సమాజంలో మార్పు కోసమే నైతిక విలువలతో కూడిన విద్య

- మహిళలను గౌరవించేలా పాఠ్యపుస్తకాల్లో మార్పులు తెస్తున్నామన్న లోకేశ్
- పెట్టుబడులతో పాటు నైతిక విలువల్లోనూ ఏపీని అగ్రగామిగా నిలుపుతామన ధీమా
- తల్లిదండ్రుల నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టాలని పిలుపు

పెన్ పవర్ డెస్క్: నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమాజంలో ఆశించిన మార్పు సాధ్యమవుతుందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలోనే కాకుండా, నైతిక విలువలను

వివరాలు 2లో..

# ఎన్టీఆర్ ప్రభావం వల్లే నాపై మరక పడలేదు



- ప్రస్తుత రాజకీయాలు కలుషితమయ్యాయన్న మంత్రి తుమ్మల
- తన రాజకీయ జీవితంపై ఎన్టీఆర్ ప్రభావం ఎంతో ఉందని వెల్లడి
- ఎన్టీఆర్ శిష్యుడినని చెప్పుకోవడం గర్వంగా ఉందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రస్తుత రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు కలుషితమైపో యాయని, విలువలు

వివరాలు 2లో..

# కోట్లాది భక్తుల పవిత్ర నమ్మకాన్ని విచ్ఛిన్నం చేశారు

- తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై పవన్ ట్వీట్
- గత ప్రభుత్వం భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని విమర్శ
- వైసీపీ హయాంలో టీటీడీ బోర్డు భక్తుల మనోభావాలను గాయపరిచిందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:తిరుమలలో కల్తీ నెయ్యి వాడకంపై జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వంపై, అప్పటి టీటీడీ బోర్డుపై సంచలన ఆరోపణలు చేస్తూ ఆయన ట్వీట్ చేశారు. గత ఐదేళ్ల పాలనలో భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశారని, వారి నమ్మకానికి ద్రోహం చేశారని తీవ్రంగా విమర్శించారు."తిరుమల కేవలం ఆలయం కాదు, అది మన భక్తికి మూలం. ప్రగాఢ విశ్వాసంతో మనమంతా అక్కడికి వెళతాం. కానీ గత ప్రభుత్వ హయాంలోని

వివరాలు 2లో..

# భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం..

## శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని

- భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం
- కొత్త సీజేఐకి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- 2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్
- పలువురు కేంద్ర మంత్రులు, విదేశీ న్యాయమూర్తులు హాజరు



పెన్ పవర్ డెస్క్:భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తన సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' లో పేర్కొన్నారు.

వివరాలు 2లో..

# వాళ్లు అంగీకరిస్తే ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటాను

**సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు**



- అధిష్ఠానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రిగా కొనసాగుతానని వెల్లడి
- ముఖ్యమంత్రి మార్పుపై తుది నిర్ణయం కేంద్ర నాయకత్వంపై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్య
- అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉండాలని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్న వేళ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే ఐదేళ్లు తాను ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, ముఖ్యమంత్రి మార్పుపై తుది నిర్ణయం పార్టీ కేంద్ర నాయకత్వం తీసుకుంటుందని అన్నారు.అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని తాను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుందని

వివరాలు 2లో..

# మా పంచసూత్రాలు చూసి జగన్ ఏడుస్తున్నారు

- జగన్‌కు కుట్రలు, ఈర్ష్య పెరిగిపోయాయన్న మంత్రి అనగాని
- కూటమి పాలనలో రైతుల సంతోషాన్ని చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శ
- పంచసూత్రాలతో రైతులను ప్రపంచ మార్కెట్‌తో పోటీపడేలా చేస్తామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ కు కుట్రలు, కుతంత్రాలతో పాటు ఈర్ష్య, అసూయ కూడా పెరిగిపో తున్నాయని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు సంతోషంగా ఉండటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.

వివరాలు 2లో..



# మావోయిస్టుల బహిరంగ లేఖ.. ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి


- ఆయుధాలు వదిలేయడానికి ఫిబ్రవరి వరకు సమయం కోరిన మావోయిస్టులు
- భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్లు ఆపేయాలని డిమాండ్
- ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులను ఉద్దేశించి లేఖ



పెన్ పవర్ డెస్క్: మావోయిస్టులపై సీరియస్‌గా దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మార్చిలోగా మావోయి స్టులను ఏరివేయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా భద్రతా బలగాలతో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ మావోయిస్టులకు లొంగిపోవాలని సూచించింది. ఇటీవల జరిగిన పలు ఎన్ కౌంటర్లలో మావోయిస్టు కీలక

వివరాలు 2లో..

# రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో తుపాను



- హిందూ మహాసముద్రంలో ఒకేసారి క్రియాశీలకమైన మూడు వ్యవస్థలు
- తమిళనాడులోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- రాబోయే కొద్ది రోజుల పాటు కొనసాగనున్న భారీ వర్షాలు
- శనివారం నుంచి ఏపీ దక్షిణ కోస్తాపై ప్రభావం!

వివరాలు 2లో..

# పార్టీ ఉంటేనే మనకు గుర్తింపు

- టీడీపీ ఉంటేనే నాయకులకు గుర్తింపు ఉంటుందన్న అనిత
- అధికారం వచ్చిందని ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచన
- స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపునకు కృషి చేయాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ ఉంటేనే నాయకు లుగా మనలాంటి వారికి గుర్తింపు ఉంటుందని, అధికారం చేతికి వచ్చిందన్న నిర్లక్ష్యం ఎవరిలోనూ ఉండకూడదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో పాయకరా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### సిద్దూ ఔట్..? కర్ణాటక సీఎంగా డీకే..? వేగంగా మారుతున్న పరిణామాలు?

కర్ణాటక రాజకీయాలు మరోసారి ఉత్కంఠకు గురవుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తెరతీశాయి. "పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తేనే నేను ఐదేళ్లు సీఎంగా కొనసాగుతాను" అని ఆయన చేసిన వ్యాఖ్యలు, సీఎం మార్పుపై చర్చలను మరింత రగిలించాయి.ఇప్పటివరకు "ఐదేళ్లు తానే ముఖ్యమంత్రి" అని ధీమాగా చెప్పిన సిద్ధరామయ్య... ఇప్పుడు ఆ స్వరాన్ని కొంత మార్చడం గమనార్హం. ముఖ్యమంత్రి మార్పు పూర్తిగా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వ నిర్ణయమని, తాను , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆ నిర్ణయాన్ని పాటించాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.

**రెండున్నరేళ్ల ఫార్ములా గడువు ముగిసింది**

2023లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి గద్దె మీదకు వచ్చిన సమయంలోనే, రెండు-రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ జరుగుతుందన్న ప్రచారం పార్టీ వర్గాల్లో బలంగా వినిపించింది. నవంబర్ 20తో ఆ అనధికారిక గడువు ముగియడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఇదే సమయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ శిబిరాల నేతలంతా దిల్లీకి తరలివెళ్లడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.

**ముఖ్యమంత్రి కుర్చీ పోటీ పెరిగిందా?**

మొదట ముఖ్యమంత్రి పదవి పోటీ కేవలం సిద్ధరామయ్య – డీకే శివకుమార్ మధ్యనే ఉందని భావించబడింది. కానీ ఇప్పుడు పోటీ మరింత విస్తరించినట్లు తెలుస్తోంది. బెంగళూరులో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసాన్ని ముఖ్యమంత్రి పీఠం కోసం ప్రధాన ఆశావహులు సందర్శించడం రాజకీయ అనుమానాలకు తావిచ్చింది.

**డీకేపై అధిష్ఠానం సందేహాలు?**

ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై అధిష్ఠానానికి పూర్తిగా సానుకూలత లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయనకు మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నా, పార్టీ అంతటా విస్తృతమైన మద్దతు లేదని కేంద్ర నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, సిద్ధరామయ్య తన వర్గానికి చెందిన అహింద వర్గానికి చెందిన నాయకత్వాన్ని బలపరచాలన్న లక్ష్యంతో ప్రయత్నిస్తున్నారనే ప్రచారం కూడా ఉంది.

**రాహుల్ గాంధీ జోక్యం?**

ఈ గందరగోళం అంతర్గత అసంతృప్తిని నివారించడానికి రాహుల్ గాంధీ జోక్యం చేసుకునే అవకాశముండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయనే చివరకు అధికార పంపిణీపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని భావిస్తున్నారు.

కర్నాటక కాంగ్రెస్‌లో నాయకత్వంపై నెలకొన్న ఈ అస్పష్టత, రాష్ట్రంలోనే కాక జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశమైంది. తదుపరి రోజుల్లో అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కేవలం కర్ణాటక భవిష్యత్ పాలననే కాదు.. కాంగ్రెస్ అంతర్గత శక్తి సమీకరణాలనూ స్పష్టతచేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ద

## మావోయిస్టుల బహిరంగ లేఖ.. ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి

- మొదటి పేజి తరువాయి

నేతలు మరణించిన విషయం తెలిసిందే. పలువురు మావోయిస్టులు ఆయుధాలు వదిలిపెట్టి ప్రభుత్వానికి లొంగిపోతున్నారు. ఈ క్రమంలో తాజాగా మావోయిస్టులు ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. ఆయుధాలు వదిలిపెట్టి లొంగిపోవాలన్న ప్రభుత్వ సూచనపై ఈ లేఖలో సానుకూలంగా స్పందించారు. అయితే, ఆయుధాలు వదిలేందుకు తమకు కొంత సమయం కావాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సమయం ఇస్తే లొంగిపోతామని పేర్కొన్నారు. అప్పటి వరకు కూంబింగ్ ఆపరేషన్లను ఆపేయాలని, అడవులను జల్లెడ పడుతున్న భద్రతా బలగాలను వెనక్కి పిలిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కూంబింగ్ ఆపరేషన్లు వెంటనే నిలిపివేయాలని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మావోయిస్టులు తమ లేఖలో విజ్ఞప్తి చేశారు. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈమేరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్(ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదలైంది.

**లేఖలో ఏముందంటే..**

"ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ ఆయుధాలను వదిలి వేయాలని భావిస్తోంది. అయితే, ఇందుకు ఫిబ్రవరి 15 వరకు సమయం కావాలి. ఈమేరకు గడువు ఇవ్వాలని ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవు. ఆయుధాలను వదిలి పెట్టాలన్న నిర్ణయంపై సహచరులను సంప్రదించి అందరి ఆమోదం పొందేందుకు సమయం పడుతుంది. కమ్యూనికేట్ చేసేందుకు మాకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నాం. ఈ సమయంలో పీఎల్జీఏ వారోత్సవాన్ని నిర్వహించడం సహా అన్ని కార్యకలాపాలను ఆపేస్తాం. అదే సమయంలో కూంబింగ్ ఆపరేషన్లను ఆపేయాలని ప్రభుత్వాలను కోరుతున్నాం" అని మావోయిస్టులు తమ లేఖలో పేర్కొన్నారు.

## పార్టీ ఉంటేనే మనకు గుర్తింపు

- మొదటి పేజి తరువాయి

వుపేట నియోజకవర్గ టీడీపీ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమం ప్రారంభంలో జిల్లా అధ్యక్షుడు తాతయ్య బాబుతో కలిసి మంత్రి అనిత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, నూతన కమిటీల సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అవమానాలు, కష్టాలు ఎదుర్కొన్న కార్యకర్తల సమష్టి కృషితోనే నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కష్టపడి పనిచేసే వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుంది. పదవులను అలంకరణగా కాకుండా బాధ్యతగా భావించాలి" అని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో పనిచేసి కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నర్సీపట్నం అడ్డు రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల నాటికి నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# కుటుంబ సమగ్ర సమాచారంతో స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్...

- మొదటి పేజి తరువాయి

ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చవచ్చని అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సాంకేతిక వెన్నెముకగా రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) ఆధ్వర్యంలోని డేటా లేక్‌ను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇతర శాఖలు కూడా వాడుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు వచ్చే ఏడాది జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కార్డులో దాదాపు 25 రకాల వివరాలతో పాటు 'పీ4' లాంటి అంశాలను కూడా పొందుపరచాలని సూచించారు. కుటుంబంలోని సభ్యుల వ్యాక్సినేషన్ వివరాలు, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ పత్రం, పౌష్టికాహార స్థితి, రేషన్ కార్డు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, వృద్ధులు, వితంతువులకు అందే పెన్షన్ల వరకు అన్ని వివరాలను ఈ కార్డు ద్వారా ట్రాక్ చేసేలా వ్యవస్థను రూపొందించాలని అన్నారు. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాలకు మాత్రమే ఈ వ్యవస్థను పరిమితం చేయవద్దని, పౌరులకు సంబంధించిన స్టాటిక్, డైనమిక్ డేటాను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, వారి జీవితంలోని ప్రతి దశలో ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లను ఈ వ్యవస్థ ద్వారా అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు నిరంతరం అప్‌డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా పటిష్టమైన వ్యవస్థను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి, జూన్ నాటికి కార్డుల పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఆర్థిక, వైద్యారోగ్య, గ్రామవార్డు సచివాలయ, పురపాలక, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇక సెలవు

బాలీవుడ్ 'హీ-మ్యాన్'గా కోట్లాది మంది అభిమానుల గుండెల్లో నిలిచిపోయిన దిగ్గజ నటుడు ధర్మేంద్ర అంత్యక్రియలు ముంబైలో ముగిశాయి. పవన్ హన్స్ శ్మశానవాటికలో ఆయన కుటుంబ సభ్యులు, సినీ పరిశ్రమ ప్రముఖుల అశ్రునయనాల మధ్య అంతిమ సంస్కారాలు జరిగాయి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, సోమవారం ఉదయం 89 ఏళ్ల వయసులో తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో భారత సినీ పరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది.ధర్మేంద్రకు తుది వీడ్కోలు పలికేందుకు బాలీవుడ్ పరిశ్రమ కదిలివచ్చింది. అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్, ఆమిర్ ఖాన్ సహా పలువురు సీనియర్, జూనియర్ నటీనటులు, దర్శకులు, నిర్మాతలు శ్మశానవాటికకు చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళు లర్పించారు. ఆరు దశాబ్దాల పాటు వెండితెరపై తనదైన ముద్ర వేసిన సహచర నటుడిని కోల్పోవడంతో వారంతా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.ఈ నెల ఆరంభంలో ధర్మేంద్ర ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేరి, నవంబర్ 12న డిశ్చార్జ్ అయ్యారు. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నప్పటికీ, తిరిగి విషమించడంతో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఇదిలా ఉండగా, ఆయన మరణించిన రోజే ఒక భావోద్వేగభరితమైన

యాదృచ్ఛిక సంఘటన చోటుచేసుకుంది. ఆయన నటించిన చివరి చిత్రాలలో ఒకటైన 'ఇక్కీస్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. డిసెంబర్‌లో థియేటర్లలోకి రానున్న ఈ యుద్ధ నేపథ్య చిత్రం, వెండితెరపై ఆయన చివరి ప్రదర్శనలలో ఒకటిగా నిలిచిపోనుంది. ఈ పోస్టర్ విడుదల అభిమానులను మరింత శోకసంద్రంలోకి నెట్టివేసింది.ధర్మేంద్ర తన ఆరు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రయాణంలో లెక్కలేనన్ని మరపురాని పాత్రలతో ప్రేక్షకులను అలరించారు. ఆయన మరణం భారత సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆయన నటన, వారసత్వం తరతరాలుగా ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

## రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో తుపాను

హిందూ మహాసముద్రంలో ఒకేసారి మూడు కీలక వాతావరణ వ్యవస్థలు బలపడటంతో తమిళనాడుపై తుపాను గండం పొంచి ఉంది. రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (ఆర్ఎంసీ) హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన జారీ చేసింది.

ఆర్ఎంసీ డైరెక్టర్ ఏ. ఆముద మీడియాకు వివరాలు వెల్లడించారు. హిందూ మహాసముద్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడు ఆవర్తనాలు క్రియాశీలకంగా ఉన్నాయని తెలిపారు. అండమాన్ సముద్రంలో ఆదివారం ఏర్పడిన తీవ్ర వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మలేషియా, మలక్కా జలసంధి సమీపంలో కేంద్రీకృతమై ఉందని చెప్పారు. ఇది రాబోయే 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాత 48 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేశారు.మరోవైపు కన్యాకుమారి ప్రాంతంలో కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి ప్రభావంతో రేపు (నవంబర్ 25) కన్యాకుమారి సముద్రం, నైరుతి శ్రీలంక జలాల్లో కొత్త అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయని తెలిపారు. అరేబియా సముద్రంలోని మూడో ఆవర్తనం కూడా స్థిరంగా ఉందని, ఈ మూడు వ్యవస్థలు ఒకదానిపై ఒకటి ప్రభావం చూపే అవకాశం ఉందని ఆమె వివరించారు.

ఈశాన్య రుతుపవనాలు తీవ్రం కావడంతో గత 24 గంటలుగా తమిళనాడులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో అతి భారీ వర్షపాతం, 15 ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. రాబోయే రోజుల్లో తెన్కాశి, తిరునల్వేలి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. నవంబర్ 29 వరకు కన్యాకుమారి, తూత్తుకుడి, తంజావూరు, తిరువారూర్, నాగపట్నం సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక సూచనలు పాటించాలని అధికారులు కోరారు.కాగా, కొన్ని ప్రైవేటు వాతావరణ సంస్థల అంచనాల ప్రకారం... తుపాను ప్రభావం ఏపీ దక్షిణ కోస్తాపై తీవ్ర స్థాయిలో ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ తుపాను ప్రభావం శనివారం నుంచి ఏపీ కోస్తా జిల్లాలపై ఉంటుందని అంచనా.

## కోట్లాది భక్తుల పవిత్ర నమ్మకాన్ని విచ్ఛిన్నం చేశారు

- మొదటి పేజి తరువాయి

టీటీడీ బోర్డు, అధికారులు భక్తుల హృదయాలను విచ్ఛిన్నం చేశారు. మన భక్తిని వారు ఒక అవకాశంగా చూశారు" అని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి ఒక అవకాశం ఇవ్వడం ద్వారా ప్రతి భక్తుడు మోసపోయాడని ఆయన అన్నారు.2019 నుంచి 2024 మధ్య కాలంలో సుమారు 10.97 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని, అంటే ప్రతిరోజూ సగటున 60 వేల మంది తిరుమల వచ్చారని పవన్ గుర్తుచేశారు. సామాన్యుల

నుంచి రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి అత్యున్నత స్థాయి వ్యక్తుల వరకు అందరూ దర్శించుకునే పవిత్ర క్షేత్రంలో నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన పవిత్రమైన నమ్మకాన్ని వారు పూర్తిగా విచ్ఛిన్నం చేశారని పవన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## మా పంచసూత్రాలు చూసి జగన్ ఏడుస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం రైతుల సాధికారత కోసం 'పంచసూత్రాలు' అమలు చేస్తుంటే, వారి మంచిని చూడలేక జగన్ ఏడుస్తున్నారని ఆయన మండిపడ్డారు. జగన్ పాలనలో రైతులకు అండగా నిలిచిన దాఖలాలు లేవని, వారిని ఆత్మహత్యల వైపు నెట్టారని ఆరోపించారు. రైతుల ఆత్మహత్యలే ఆయన పాలనకు నిదర్శనమని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న పంచసూత్రాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తామని అనగాని భరోసా ఇచ్చారు. రైతులు తాము పండించిన ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడే స్థాయికి ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. రైతుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుతుంటే, జగన్ ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

## వాళ్లు అంగీకరిస్తే ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటాను

- మొదటి పేజి తరువాయి

ఆయన స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితం ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య ప్రకటించినప్పటికీ, తాజాగా అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యమని చెప్పడం చర్చనీయాంశమైంది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందిన తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ చెరో రెండున్నరేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారనే ప్రచారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయిన నేపథ్యంలో, డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ఆయన ముఖ్యమంత్రి అవుతారనే తరహాలో వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల అధిష్ఠానాన్ని ఒప్పించేందుకు వారు ఢిల్లీకి వెళ్లినట్టు ప్రచారం జరిగింది.

## భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం..

### శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని

- మొదటి పేజి తరువాయి

అనేక చారిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామి అయిన జస్టిస్ సూర్యకాంత్, ఇటీవలి సంప్రదాయానికి భిన్నంగా దైవసాక్షిగా హిందీలో ప్రమాణం చేయడం విశేషం. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, హర్యానా ముఖ్యమంత్రి నాయిబ్ సింగ్ సైనీ హాజరయ్యారు. వీరితో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, భూటాన్, కెన్యా, మలేషియా, బ్రెజిల్, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు కూడా పాల్గొన్నారు.జస్టిస్ సూర్యకాంత్ సుమారు 14 నెలల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ సిఫార్సు చేయగా, అక్టోబర్ 30న కేంద్ర ప్రభుత్వం ఆయన నియామకానికి ఆమోదం తెలిపింది.

1962 ఫిబ్రవరి 10న హర్యానాలో జన్మించిన జస్టిస్ సూర్యకాంత్, 1984లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2000వ సంవత్సరంలో హర్యానాకు అత్యంత పిన్న వయస్కుడైన అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. అనంతరం పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయన జాతీయ న్యాయ సేవల అథారిటీ (నల్సా)లో కూడా కీలక సేవలు అందించారు.

## సమాజంలో మార్పు కోసమే నైతిక విలువలతో కూడిన విద్య

- మొదటి పేజి తరువాయి

పెంపొందించడంలోనూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఆయన ఉద్ఘాటించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన 'నైతిక విలువల'పై రాష్ట్రస్థాయి విద్యా సదస్సులో లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "సమాజంలో నైతిక విలువలను పెంపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గారు సంకల్పించారు. ఈ పవిత్రమైన బాధ్యతను నాపై ఉంచారు. దీనికోసం ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారిని కేబినెట్ ర్యాంకు హోదాతో ప్రభుత్వ సలహాదారుగా నియమించాం. ఎంతోమంది పదవుల కోసం ఆరాటపడతారు. కానీ చాగంటి గారు పదవిని స్వీకరించిన తర్వాత కనీసం ప్రభుత్వ వాహనం గానీ, ఇతర సౌకర్యాలు గానీ తీసుకోలేదు. ఆయన సెల్ ఫోన్ బిల్లు కూడా ఆయనే చెల్లించుకుంటున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి మార్గనిర్దేశంలో మీ భవిష్యత్తు కోసం నైతిక విలువల పుస్తకాలను రూపొందిస్తున్నాం" అని తెలిపారు.

**విద్యా వ్యవస్థలో సంస్కరణలు**

ప్రభుత్వం విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలను లోకేశ్ ఏకరువు పెట్టారు. "కేవలం 150 రోజుల్లో ఒక్క లిటిగేషన్ లేకుండా 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశాం. టీచర్ల బదిలీల కోసం పారదర్శకమైన చట్టం తెచ్చాం. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేస్తున్నాం. విద్యార్థులకు అందించే కిట్స్‌పై నాయకుల ఫోటోలు తొలగించి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు పెట్టాం. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టాం. ప్రతి శనివారాన్ని 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది" అని విద్యార్థులకు సూచించారు.ఈ బృహత్తర కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు గారు తమకు దిశానిర్దేశం చేయాలని లోకేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ప్రభావం వల్లే నాపై మరక పడలేదు

- మొదటి పేజి తరువాయి

కనుమరుగవు తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత అవినీతిమయమైన రాజకీయాల్లో తనపై ఎలాంటి మరక పడకుండా ఉన్నానంటే, దానికి స్ఫూర్తి దివంగత నేత ఎన్టీ రామారావేనని స్పష్టం చేశారు. ఈరోజు ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.తన రాజకీయ జీవితంపై ఎన్టీఆర్ ప్రభావం చాలా ఉందని తుమ్మల అన్నారు. 1983 నుంచి ఆయన అడుగుజాడల్లోనే నడుస్తున్నానని తెలిపారు. "ఎన్టీఆర్ శిష్యుడు ఎవరు అంటే తుమ్మల" అనేలా పేరు తెచ్చుకున్నానని భావోద్వేగానికి గురయ్యారు. రాముడి పాదాల చెంత ఎన్టీఆరే స్వయంగా తనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఆయన నుంచే నిజాయతీ, నిబద్ధతతో రాజకీయాలు చేయడం నేర్చుకున్నానని వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా,

అంతకుముందు మంత్రి తుమ్మల తెలంగాణ రైతులకు శుభవార్త చెప్పారు. అర్హులైన రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని త్వరలోనే జమ చేయనున్నట్లు ప్రకటించారు. రెండు విడతల్లో, ప్రతీ సీజన్‌కు రూ.6,000 చొప్పున ఈ సాయం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# జిల్లాలో ప్రతి గ్రామాన్ని సాంకేతికతతో అనుసంధానం చేయాలి.




**అందుకు అనుగుణంగా కొత్త మొబైల్ టవర్ల నిర్మాణం**

**జిల్లా కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్**

**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 24:** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి సాంకేతికతను మరింత అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ లో మూడు ఐటిడిఏ పిఓలు, సబ్ కలెక్టర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, మండల రెవెన్యూ అధికారులతో వర్చువల్ గా వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు ముడిపడి ఉన్నటువంటి సాంకేతికలు సమస్యలను అధిగమించడానికి సెల్ టవర్ లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సెల్ టవర్ నిర్మాణాలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెల్ టవర్ నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించాలని, భూ సమస్యలను అధిగమించడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనువైన ప్రదేశాలు లేని చోట అటవీ శాఖ పర్మిషన్ తో అటవీ స్థలాలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్, జియో ఎయిర్టెల్ యొక్క టవర్ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. ఇంకా ఏయే ప్రదేశాల్లో కొత్త టవర్ల నిర్మాణం అవసరమవుతుందో ఆ ప్రదేశాలను గుర్తించి ఒక సమగ్రమైనటువంటి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం ఐటిడిఏ పివో స్మరణ్ రాజ్, చింతూరు ఇంచార్జ్ ఐటిడిఏ పివో శుభం నోఖ్వాల్, పాడేరు ఇంచార్జ్ ఆర్ డి వో ఎస్ వివిఎస్. లోకేశ్వరావు, సర్వీస్ ప్రొవైడర్లు, పలు మండలాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# విశాఖలో జాతీయ స్థాయి కీలక సమావేశాలు ఏర్పాట్లు పటిష్టం చేయాలని




**కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాలు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 24 :**విశాఖపట్నం జాతీయ స్థాయి సమావేశాలకు వేదికగా నిలుస్తోంది. నవంబర్ 27, 28 తేదీల్లో నోవోటెల్ హెూటల్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు ప్రధాన కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో, అన్ని విభాగాలు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.27న బాల్ వివాహ్ ముక్త్ భారత్ ప్రచార ప్రారంభం సి ఎ ఆర్ ఎ జాతీయ అడాప్షన్ కాన్క్లేవ్

కలెక్టర్ వివరించారు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న బాల్ వివాహ్ ముక్త్ భారత్ బి వి ఎం బి 100 రోజుల ప్రత్యేక అవుట్రీచ్ ప్రచారాన్ని నవంబర్ 27న విశాఖపట్నంలో ప్రారంభించనున్నారు.అదే రోజు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ సి ఎ ఆర్ ఎ నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాంక్లేవ్ నిర్వహించనుంది. ఈ సమావేశానికి ఎస్ ఏ ఆర్ ఎ , చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు డి సి పి యు, అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రాస్పెక్టివ్ అడాప్టివ్ పేరెంట్స్ పి ఎ పి లు హాజర వుతారని తెలిపారు.28 న పార్లమెంటు సంప్ర దింపుల కమిటీ సి సి పి ప్రత్యేక సమావేశం

మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న పార్లమెంటు సంప్రదింపుల కమిటీ సి సి పి ప్రత్యేక సమావేశం 28న జరుగనుందని, కేంద్ర మంత్రులు, ప్రముఖులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు అని కలెక్టర్ తెలిపారు.అతిథులకు ప్రోటో కాల్ ప్రకారం స్వాగతం అన్ని శాఖలకు ప్రత్యేక సూచనలు కార్యక్రమాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ విభాగాల వారీగా సూచనలు జారీ చేశారు:,అతిథుల రాక సందర్భంగా విమానాశ్రయంలో సంప్రదాయ స్వాగ తానికి శాస్త్రీయ నృత్య కళాకారులను ఏర్పాటు చేయాలి ప్రోటోకాల్ ప్రకారం వాహనాల కేటాయింపు, లైజన్ అధికారుల నియామకం వెంటనే పూర్తి చేయాలి,ప్రముఖులకు భద్రత, ట్రాఫిక్ క్లియరెన్స్ పై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలి,సమావేశ వేదికలో ఎల్.ఈ.డి స్క్రీన్‌లు, డిజిటల్ సపోర్ట్ టీములు, ఐటీ సాంకేతిక సిబ్బం ది ఏర్పాట్లు పూర్తి చేయాలి,రెండు రోజుల కార్యక్రమాలకు లైవ్ స్ట్రీమింగ్ సౌకర్యాన్ని కల్పించాలి,ప్రత్యేక అవసరాలున్న పిల్లల దత్తతపై రూపొందించిన లఘు చిత్ర ప్రదర్శనకు ప్రత్యేక స్థలం కేటాయించాలి,వేదిక వద్ద అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయాలి,కేంద్ర ప్రముఖుల కు ఆలయ దర్శనాలు, స్థానిక పర్యాటక ప్రదేశాల పర్యటనలకు ప్రత్యేక షెడ్యూల్ సిద్ధం చేయాలి,కార్యక్రమాల అంతర్జాతీయ ప్రాము ఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఏ విభాగం లోపాలు లేకుండా సమయానుకూల చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు.

# వి.ఎమ్.ఆర్.డి.ఎ. ప్రజా దర్బార్

**వినతుల పరిశీలనకు చైర్మన్ ప్రణవ్ గోపాల్ ప్రత్యేక దృష్టి**






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 24 :**వి ఎమ్ ఆర్ డి ఎ ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి వినతిని వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించాలని విఎంఆర్??? చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ఆదేశించారు.సోమవారం ఉదయం విఎంఆర్??? కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో చైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రో పాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ కలిసి పిటిషనర్లను వ్యక్తిగతంగా కలుసుకుని వారి సమస్యలు వివరంగా తెలుసుకున్నారు.చైర్మన్ మాట్లాడుతూ పిటిషనర్లు పెట్టిన అభ్యర్థన లను నిశితంగా పరిశీలించి, నిర్ణయించిన గడువు లోపలే పరిష్కారం అందించాలి అని సంబంధిత విభాగాధికారులకు సూచించా రు.అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఉపశమనం కల్పించిందని, ఎల్ ఆర్ ఎస్ -2020 పథకాన్ని కొనసాగిస్తూ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.సోమవారం ప్రజా దర్బార్‌లో మొత్తం 14 వినతులు స్వీకరించగా

ప్రణాళిక శాఖ : 9,పరిపాలన : 2,ఎస్టేట్ విభాగం : 2,సాంకేతిక విభాగం : 1,వీటిపై తక్షణ చర్యలు ప్రారంభించేందుకు సంబంధిత విభాగాలకు దిశానిర్దేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారి శిల్పా, కార్యదర్శి మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత పెంచాలి



**పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ సూచనలు**

**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 24 :**ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని శాస్త్రీ యంగా మార్చి, ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచే దిశగా అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. ఒకే సమస్యపై పునరావృత ఫిర్యాదులు రాకుండా స్థిరమైన పరిష్కా రాలు అందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్ సమావే శహాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి ప్రజల వినతులు స్వీకరించిన కలెక్టర్ ఫిర్యాదుదారులతో సంబంధిత అధికారులు తప్పనిసరిగా ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యలపై స్పష్టమైన ఎండార్స్మెంట్లు ఇవ్వాలని ఆదేశించారు. రీ%-%ఓపెన్ అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టా లన్నారు. సోమవారం మొత్తం 358 వినతులు స్వీకరించగా, అందులో 118 రెవెన్యూ, 129 జీవీఎంసీ, 20 పోలీస్ శాఖకు సంబంధించినవి కాగా, మిగతా 91 వివిధ ఇతర అంశాలకు సంబంధించినవిగా నమోదయ్యాయి. గత వారం పీజీఆర్ఎస్ పరిష్కారాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కాల్ సెంటర్ ఫీడ్‌బ్యాక్ నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సూచించారు.పీజీఆర్ఎస్‌లో ఎక్కువగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నందున, ఆయా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశిం చారు. అక్రమ నిర్మాణాల నియంత్రణపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజా ఫిర్యా దుల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించే, నిబంధ నలు అనుసరించి ఎండార్స్మెంట్ ఇవ్వని అధికారులకు హెడ్‌ఆఫ్‌డిపార్ట్‌మెంట్‌లు మెమోలు జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కార ఫలితాలు రోజురోజుకూ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ వర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు వైఎస్ఆర్సిపి అండ

**59 వ వార్డు నాయకుల చేతుల మీదుగా ఆర్థిక సహాయం**



**ములగాడ, పెన్ పవర్, నవంబర్ 24 :**59వ వార్డు శాంతిగిరి కాలనీలో జరిగిన అగ్నిప్ర మాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాలను వైఎస్ఆర్సిపి నాయకులు పరామర్శించి సహాయం అందించారు. పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ మల్లా విజయ ప్రసాద్ బాధితులను ప్రత్యక్షంగా కలిసి పరామర్శిస్తూ, పార్టీ ఎప్పటికీ తమకు అండగా ఉంటుం దని భరోసా ఇచ్చారు.తదనంతరం 59వ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు రేవల్ల సత్యనారా యణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ముందు కొచ్చి బాధితులకు ఆర్థిక సహాయం అందించా రు. అగ్నిప్రమాదానికి గురైన గురి సత్యవతి (%ఔ/శీ% వెంకట రమణ) మరియు పైల వరలక్ష్మి (%ఔ/శీ% సత్తిబాబు) కుటుంబాలకు మొత్తం రూ 15,000 నగదును డాక్టర్ మల్లా విజయ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో వార్డు వైస్ ప్రెసిడెంట్ ఎదురు సత్యనారాయణ, మడక అప్పారావు, సంపత్, దేవర రమేష్, ఎడ్ల సత్యనారా యణ, అర్జున్, కోరాడ వాసు, కోరాడ శ్రీను, నందిని, చందు రెడ్డి, శోభన్, శాంతిగిరి కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్, మాజీ ప్రెసిడెంట్ మొల్లి శ్రీనివాస్, ప్రసాద్, బుడి మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్సిపి నాయకుల ఈ స్పందన స్థానికుల ప్రశంసలు పొందింది.

# మహిళల సంరక్షణకి ప్రాధాన్యత ఇచ్చే ప్రభుత్వం





* విశాఖ జిల్లాలో మూడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,నవంబర్ 24 :**విశాఖ జిల్లా గాజువాక మండలం వడ్లపూడి శివారు ఆటోనగర్ లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం కొరకు సోమవారం శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమం కి ముఖ్య అతిధులు గా విశాఖ జిల్లా ఎంపి శ్రీ భరత్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, నగర్ మేయర్ పీలా శశ్రీనివాస్, నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.స్థానిక కార్పొరేటర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం అతిధులు మాట్లాడుతూ ఈ హాస్టల్ నిర్మాణం ఉద్యోగినుల భద్రత, వసతి సౌకర్యాలలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారని, అలాంటి మహిళలకు సురక్షితమైన వసతి అవసరం ఎంతో ముఖ్యమైందని అన్నారు. ఈ హాస్టల్ పూర్తయితే ఉద్యోగాల కోసం వెలుపల నుంచి వచ్చే మహిళలు నిర్భయంగా, నాణ్యమైన వసతి సదుపాయాలతో జీవించగలరని తెలిపారు.సుమారు 17 కోట్ల రూపాయలు తో నిర్మిస్తున్న ఈ హాస్టల్ ప్రత్యేకంగా ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఇది తోడ్పడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. హాస్టల్‌లో ఆధునిక సౌకర్యాలు, భద్రతా చర్యలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతకు కొత్త మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రసాదుల శ్రీను,నియోజకవర్గం కార్పొరేటర్లు,87వ వార్డ్ నాయకులు బెల్లంకొండ రాజన్న రాజు, జనసేన నాయకులు సిరిసిపల్లి కనకరాజు , బొట్టా ప్రకాష్,పావాడ రమణమూర్తి, శ్రీనివాస్ నాయుడు, డివి సూరిబాబు, బొడ్డ సన్యాసి, ఆనంద్ కుమార్,కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, గెద్దాడ రాంబాబు, పోతల కృష్ణ, గండేపల్లి రాము, గెద్దాడ అప్పారావు,మాటూరి రాము, జాన్ రమేష్,ఆదినారాయణ, సుందర్ సునీల్, సన్యాసిరావు, నియోజకవర్గం కూటమి నాయకులు కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## అనారోగ్యంతో ఉన్న ఎంపీటీసీ భీమరావును పరామర్శించిన వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ ఎంపీటీసీ గెమ్మెలి భీమరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, గూడెం కొత్త వీధి వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్ సోమవారం ఎంపీటీసీ భీమారావు స్వగ్రామమైన భీమవరం గ్రామానికి వెళ్లి ఎంపీటీసీని పరామర్శించారు.ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఆనంద్ భీమరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గెమ్మెలి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ ఎనీమియా బాధితురాలికి కలెక్టర్ చేయూత



**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం కొయ్యూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సరమండ లక్ష్మి అనే మహిళకు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ చేయూతనందించారు. ?సికిల్ సెల్ ఎనీమియా అనే తీవ్రమైన రక్తహీనత వ్యాధితో బాధపడుతున్న బాధితురాలికి, ఆమెకు జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో కలెక్టర్ స్వయంగా కుట్టు మిషన్ను అందజేశారు. ?కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. లక్ష్మి కి కుట్టు మిషన్ ఇవ్వడం ద్వారా ఆమె ఆర్థికంగా కొంత స్థిరపడటానికి అవకాశం కలుగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కొయ్యూరు మండల సమస్యల పరిష్కారంపై ఆర్డీఓ సమీక్ష



**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**ఆర్డీఓ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు**

**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 24:** కొయ్యూరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు పాడేరు డివిజన్ ఆర్డీఓ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ?తహసీల్దార్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షలో ముఖ్యంగా రెవెన్యూ, రీసర్వే పనులు, మీ కోసం గ్రీవెన్సులు, సివిల్ సప్లై అంశాలు, జాతీయ రహదారి 516ఈ భూసేకరణ సమస్యలు, మరియు ఆర్వో ఎఫ్ ఆర్ పట్టాల జారీకి సంబంధించిన పెండింగ్ సమస్యలపై ఆర్డీఓ లోకేశ్వరరావు లోతుగా చర్చించారు. ?ఈ పెండింగ్ అంశాలన్నింటినీ సత్వరం పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సరిగా పనిచేయని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ తీవ్రంగా హెచ్చరించారు.

## తుమిడిపుట్టులో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

* 5 లక్షల నిధులతో 100 మీటర్లు డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం.
* లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 24.**మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ, తుమిడిపుట్టులో 100 మీటర్ల డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సర్పంచ్ మాట్లాడుతూ.. తుమిడిపుట్టులో డ్రైనేజీ లేక వర్ష కాలంలో నీరు వెళుటకు దారిలేక ఊరు మొత్తం చెత్తచెదరాలు చెల్లచెదరం అయి వర్షపు నీరు నిల్వతో వీధులంతా బురదమయంగా ఉండేదన్నారు. దీంతోనే సమస్య పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో వంద మీటర్లు డ్రైనేజీ నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు పంచాయితీ పాలక వర్గం ఆమోదంతో కేటాయించడం జరిగిందన్నారు. గ్రామంలోని మిగిలిన ప్రదేశంలో కూడ డ్రైనేజీ, సిసిరోడ్డు సమస్య కూడ దఫాలవారిగా పరిష్కారం చేయుటకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వి.బలరాం, పెసా సభ్యుడు బి.విక్రమ్, వైసిపి నేత వంతాల సాదురం, గ్రామస్థులు కె.పరదేశి, వి.పంతులు, జి.నగేష్ గుత్తేదారులు ఉమాశంకర్, ఆర్ కృష్ణ పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్య పరిష్కారంకై పోలీస్ లు చర్యలు

**గాజువాక : పెన్ పవర్ ,నవంబర్ 24** పారిశ్రామిక ప్రాంతం గాజువాక లో ఫార్మా కంపెనీ లకు సంబంధించిన అనేక మైన బస్సులు వారి ఉద్యోగులను 3 షిఫ్ట్ ల్లో గాజువాక నుండి తీసుకుని వెళ్లడానికి మరియు ఫార్మా కంపెనీల నుండి తీసుకోని రావడానికి ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు గాజువాక వచ్చి వెళుతుంటాయని , ఫార్మా బస్సులన్నీ గాజువాక ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు, 8 గంటల నుండి 9 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుండి 2 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు కు, రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు వరకు, కు శ్రీనగర్ మీదుగా వచ్చి పాత గాజువాక వద్ద యూటర్న్ తీసుకోవడం, ఈ మధ్యలో ప్రతి జంక్షన్ దగ్గర బస్సులను ఆపి ఉద్యోగులను దింపడం, ఎక్కించుకోవడం అంతేకాకుండా శ్రీనగర్ కు ఓల్డ్ గాజువాక మధ్య సర్వీస్ రోడ్ లేకపోవడం వల్ల గాజువాక లో విపరీతమైన ట్రాఫిక్ జామ్ కు కారణం అవుతున్నదని .


దానివల్ల విశాఖపట్నం సిటీలోకి వచ్చే, వెళ్ళే వాహన దారులు విపరీతమైన ట్రాఫిక్ జామ్ లో చిక్కుకుని తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారని ,అందువల్ల పోలీస్ డిపార్ట్మెంట్ ఈ సమస్య కు పూర్తి స్థాయి లో చెక్ పెట్టే శాశ్వత పరిష్కారం కొరకు ఈ క్రింది చర్యలు చేపట్టాలని నిర్ణయించిందని తెలిపారు .

నవంబర్ 25 తేదీ నుండి నుంచి ఫార్మా బస్సు లు గాజువాక లోనికి ప్రవేశించనీయకుండా గాజువాక కు సుమారు రెండు కిలోమీటర్ ల ముందు ఉన్న శ్రీనగర్ జంక్షన్ వద్ద అపబడతాయి. ఫార్మా బస్సులన్నీ శ్రీనగర్ వరకు వచ్చి జంక్షన్లో ఎడమవైపు తిరిగి ఆటోనగర్ లోనికి ప్రవేశించి రోడ్ కు బాగా ఎడమ వైపు ఆర్చ్ దాటి ఆపి ఫార్మా ఉద్యోగులను దించి వేయాలి. అనంతరం ఆటోనగర్లో అన్న క్యాంటీన్ జంక్షన్ వరకు వెళ్లి అక్కడ రివర్స్ చేసుకుని అదే రోడ్లో ముందుకు వచ్చి రోడ్డు పక్కగా ఆపి డ్యూటీ కి వెళ్లే ఫార్మా ఉద్యోగులను శ్రీనగర్ జంక్షన్ లో ఆర్చ్ ముందు ఎక్కించుకొని కంపెనీలకు తీసుకుని వెళ్లాలి. వారికి అవసరమైతే అదే ఆటోనగర్ రోడ్లో అన్నా క్యాంటీన్ కు శ్రీనగర్ జంక్షన్ కి మధ్యలో బాగా లెఫ్ట్ కి తీసుకొని వారి ఉద్యోగుల కొరకు తాత్కాలికంగా కొంత సమయం మిగతా వాహనాల కు ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా రెండు వైపులా కాకుండా ఒక ప్రక్కగా వేచి ఉండవచ్చును అని . ఫార్మ కంపెనీ బస్సులన్నీ ఓల్డ్ గాజువాక కు రాకుండా శ్రీనగర్ నుంచి మాత్రమే ఆపరేట్ చేయాలి అని గాజువాక మరియు పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి ఫార్మా ఉద్యోగస్తు లందరూ శ్రీనగర్ వచ్చి అక్కడ నుండి వారి బస్ ఎక్కి డ్యూటీకి హాజరు కావాలి అని , వచ్చినపుడు శ్రీనగర్ జంక్షన్ లో దిగి వారి నివాసానికి వెళ్లాలి. అందుకొ రకు ఫార్మా ఉద్యోగులకు ప్రత్యేకంగా శ్రీనగర్ జంక్షన్ వద్ద వారి వాహనాల కొరకు పార్కింగ్ ప్రొవైడ్ చేయబడును. వారి కొరకు నిర్ణయించబడిన పార్కింగ్ స్థలం లో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలి. విశాఖపట్నం సిటీలోకి ఫార్మా ఉద్యోగుల ను తీసుకువెళ్లే బస్సులు అన్నీ కూడా శ్రీనగర్ జంక్షన్లో ఎడమ వైపుకు తిరిగి పాత గాజువాక ను టచ్ చేయకుండా ఆటోనగర్ మీదుగా మెయిన్ రోడ్డులో ఆటోనగర్ జంక్షన్ వద్ద ఎక్కి విశాఖపట్నం సిటీ లోనికి వెళ్లాలి.

ఫార్మా ఉద్యోగులందరికీ శ్రీనగర్ జంక్షన్ దగ్గర పార్కింగ్ ఇవ్వడం జరిగింది. వారి వాహనము లను పార్కింగ్ చేసుకున్న అనంతరం శ్రీనగర్ జంక్షన్ లో ఆటోనగర్ రోడ్ వైపు వారి కొరకు బస్ లు ఆగుతాయి. ఆ బస్సు ఎక్కి వారి డ్యూటీ లకు వెళ్ళాలి. ఇందుకు విరుద్ధంగా ఏ సమయంలో అయినా గాజువాక లోకి ప్రవేశించే ఫార్మా బస్ ల డ్రైవర్ ల పై చట్టపరమైన చర్యలు తీసుకొన బడతాయని ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ షేక్ హూసేన్ గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, విశాఖపట్నం సిటీ తెలిపారు .



## సీలేరు పీహెచ్‌సీకి నియమితుడైన డాక్టర్ నారాయణరావును స్థానిక నాయకుల సత్కారం



**గూడెం కొత్త వీధి పెన్ పవర్ నవంబర్ 24 :**అల్లూరి సీతారామరాజు జిల్లా, జీకే వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కలెక్టర్ దినేష్ కుమార్ మరియు డీఎంహెచ్ఓ డాక్టర్ డి కృష్ణమూర్తి నాయక్ ఆదేశాలతో ఇటీవల డిప్యూటేషన్‌పై నియమితులైన డాక్టర్.పసుపులేటి నారాయణరావును స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.సీ.పీ%-%ఏ.ఎస్.ఆర్ జిల్లా పాడేరు యస్.సి. సెల్ మహిళా అధ్యక్షురాలు డికోల్లు స్వర్ణలత, స్థానిక పంచాయతీ పార్టీ అధ్యక్షుడు పేలూరి సత్యనారాయణ, నల్ల వెంకట్రావు, టైలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.వీరు డాక్టర్ నారాయణరావుకు శాలువ చుట్టి సన్మానిస్తూ, సీలేరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరుతూ అభినందనలు తెలియజేశారు.

## వార్డుల్లో యువతను బలోపేతం చేయాలి అని గాజువాక తెలుగు యువత అధ్యక్షుడు గణపతి



**గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 24** పారిశ్రామిక ప్రాంతం గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు యువత నూతన కార్యవర్గం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ పెంటిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రతి వార్డులోనూ యువతను బలోపేతం చేయాలని సూచించారు. యువ నాయకుడు నారా లోకేష్ ను ఆదర్శంగా తీసుకొని పార్టీలో యువత ఎదగాలని అన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాజువాక తెలియక ప్రధాన కార్యదర్శి వియ్యపు నరేష్, ఉపాధ్యక్షులు కంచిపాటి అప్పలరాజు, సోంపల్లి లోకేష్, పేకెట్ అప్పలరాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కిల్లి సురేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాయి వర్మ, నక్క గంగరాజు, గాజువాక తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

## నూతన గృహాల కోసం అర్హులు జియో ట్యాగింగ్ చేయించుకోవాలి : ఏఈ పసుపులేటి లక్ష్మీ విమల





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 24**:నూతన గృహాల మంజూరుకు అర్హులైన వారు తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయించుకోవాలని గూడెం కొత్త వీధి మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ (ఎఫ్ఎసి) పసుపులేటి లక్ష్మీ విమల తెలిపారు.సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని దామనపల్లి పంచాయతీ దొడ్డికొండ గ్రామంలో నూతన గృహాల మంజూరు కోసం జియో ట్యాగింగ్ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో గూడెం కొత్త వీధి మండల పేసా ప్రధాన కార్యదర్శి, కట్టుపల్లి సెగ్మెంట్ పేసా కార్యదర్శి మాదిరి చంటిబాబు పాల్గొన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఇల్లు మంజూరు కాని అర్హులైన కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.కార్యక్రమంలో గ్రామ యువకులు జుర్ర రమణబాబు, వసుపరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ‘మన డబ్బులు-మన లెక్కలు’పై ఎస్.హెచ్.జి సభ్యులకు అవగాహన-గూడెం కొత్త వీధిలో ర్యాలీ





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 24:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య-వెలుగు కార్యాలయంలో ‘మన డబ్బులు-మన లెక్కలు’ కార్యక్రమం నిర్వహించి,ఎస్.హెచ్.జి
సంఘాల మహిళలకు ఆర్థిక పరమైన అవగాహన కల్పించారు. సంఘాలు ఎలా పొదుపు చేయాలి, నిధులను ఏ విధంగా సక్రమంగా నిర్వహించాలి అనే విషయాలపై సిఆర్పీలు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రజల్లో ఆర్థిక క్రమశిక్షణపై చైతన్యం పెంపొందించాలని లక్ష్యంతో భారీ ర్యాలీ కూడా చేపట్టారు.కార్యక్రమంలో ఏపిఎం బి. సూర్యరావు, సిఆర్పీలు మేరీ, నాగమణి, సీసీలు సత్యబాబు, సన్యాసమ్మ, మోహన్‌రావు, రాజబాబు, భూలక్ష్మి, నాగమణి, రాజేశ్వరి, ఆనంద్, వివిధ విఓఎలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి అపూర్వ అవకాశం

## ప్రజలు వినియోగించుకోండి..అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 24 : రాబోయే డిసెంబర్ 13, 2025న జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ లోక్ అదాలత్ కేసుల్ని చర్చా%-%రాజీ మార్గంలో త్వరిత పరిష్కారం చేసుకునే అత్యుత్తమ వేదికగా అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ప్రజలు కోర్టు చుట్టూ తిరిగే బాధలనుండి బయటపడేందుకు లోక్ అదాలత్ గొప్ప సాధనం. సమయం, ధనం రెండింటినీ ఆదా చేసుకునే అవకాశం ఇదని పేర్కొన్నారు. పోలీసు శాఖ ప్రజలకు అన్ని విధాల సహకారం అందిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు.

ఈ లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందగల కేసులు..

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అనేక రకాల కేసులు ఈ లోక్ అదాలత్ ద్వారా రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చు. అవి వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు (సెక్షన్ 138, ఎన్.ఐ. యాక్ట్), బ్యాంకింగ్, మనీ రికవరీ కేసులు, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, ల్యాండ్ అక్విజిషన్ సంబంధిత కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు మినహా), కార్మిక%-%పారిశ్రామిక వివాదాలు, రాజీ పడ్డగల సూక్ష్మ క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే వాటిపై అప్పీలు అవకాశాలు తగ్గడంతో పాటు, తక్కువ సమయంలో న్యాయం పొందే పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రజలకు అవసరమైన సమాచారం అందుబాటులో..

జిల్లా ప్రజలు తమ కేసులు లోక్ అదాలత్‌లో ప్రవేశపెట్టేందుకు మరిన్ని వివరాల కోసం కింది చిరునామాలను సంప్రదించవచ్చు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ప్రాంగణం, విశాఖపట్నం, మండల న్యాయ సేవా సంఘాలు అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల ప్రజలకు పోలీసులు అండగా ఉంటారు.

జిల్లా పోలీస్ కార్యాలయం తరపున విడుదలైన ప్రకటనలో..

న్యాయ ప్రక్రియను సులభతరం చేసేందుకు, ప్రజలకు తక్కువ వ్యయంతో మరియు తక్కువ సమయంలో న్యాయం అందించేందుకు లోక్ అదాలత్ ఎంతో తోడ్పడనుంది. అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు.

## ఒయాసిస్ ఫర్టిలిటీ జననీ బస్సు యాత్రకు ఎమ్మెల్యేల జెండా ఊపి

సంతాన సమస్యలపై అవగాహన కోసం మెగా మొబైల్ ఫర్టిలిటీ క్యాంప్ ప్రారంభం







**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 24 :** సంతానం కోసం కష్టాలు పడుతున్న దంపతులకు ఆధునిక వైద్య సాయాన్ని చేరవేసే లక్ష్యం తో ఒయాసిస్ ఫర్టిలిటీ సంస్థ చేపట్టిన జననీ బస్సు యాత్రను బీచ్ రోడ్ వైఎంసిఏ వద్ద ఘనంగా ప్రారంభించారు. మాజీ మంత్రి , భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజ కవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ యాత్రకు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ సంతానం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న దంపతులకు వైద్య నిపుణుల సేవలు, అవసరమైన పరీక్షలు, సంపూర్ణ వైద్య సూచనలను ఒకే వేదికపై అందించేందుకు ఒయాసిస్ ఫర్టిలిటీ ముందుకువచ్చింది అని పేర్కొన్నారు. ఈ మొబైల్ క్యాంప్ ద్వారా అనేక మందికి ఆశాకిరణం అందుతుందని, సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతుల కల నెరవేరేందుకు ఇది ఎంతో ఉపయుక్తమని తెలిపారు.

కార్యక్రమానికి హాజరైన డాక్టర్ రాధిక, డాక్టర్ రాజు, డాక్టర్ శ్రీదేవి తదితరులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మెగా మొబైల్ ఫర్టిలిటీ క్యాంప్ నిర్వహించడం ఒయాసిస్ సంస్థకు మరో మైలు రాయిగా నిలుస్తుందని తెలిపారు.

ఇక ఉదయం కాళీమాత ఆలయం నుంచి వైఎంసిఏ వరకు ఒయాసిస్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, వైద్య నిపుణులు, సిబ్బం ది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సబ్ జూనియర్ విలువిద్య పోటీల్లో మరింత మెరుగ్గా రాణించాలి

అరుణాచల్ ప్రదేశ్ వెళ్ళుటకు క్రీడాకారుడిని ఆర్థిక సాయంతో అభినందించిన జిల్లా కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్



**పాడేరు , పెన్ పవర్,నవంబర్ 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నందు శ్రీ మోదమాంబ విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న సిహెచ్. మోహిత్ సాయి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ విలువిద్య పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచి, రాష్ట్ర తరపున విలువిద్య సబ్ జూనియర్ కేటగిరీలో జాతీయస్థాయిలో పాల్గొనుటకు నవంబర్ 28 నుండి డిసెంబర్ 1 వరకు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఈటానగర్ లో పాల్గొనుటకు జిల్లా కలెక్టర్ వారు ఆర్థిక సాయం అందించారు. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శనలు కనబరిచి రాష్ట్రం తో పాటు జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్ రావు, కోచ్ అడపా. సుధాకర్ నాయుడు ( ఎన్ ఎస్ ఎన్ ఐఎస్) తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న 59వ వార్డు వైఎస్ఆర్సీపీ నాయకులు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబరు 24 :** పశ్చిమ నియోజకవర్గంలోని 59వ వార్డు శాంతిగిరి కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాలను వైఎస్ఆర్సీపీ నాయకులు ఆదుకున్నారు. అగ్నిప్రమాదం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ మల్లా విజయ ప్రసాద్ వ్యక్తిగతంగా పరామర్శించి, పార్టీ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఆ వెంటనే, 59వ వార్డు వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు రేవల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో వార్డు నాయకులు ముందుకు వచ్చి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. అగ్నిప్రమాదంతో ఇల్లు కోల్పోయిన గుటి సత్యవతి, వైఫ్ ఆఫ్ వేంకట రమణ మరియు పైల వరలక్ష్మి వైఫ్ ఆఫ్ సత్తిబాబులకు మొత్తం రూ.15వేలు నగదును డా.మల్లా విజయ ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, బాధితులకు ఇళ్ల పునర్నిర్మాణంలో, అవసరమైన సహాయంలో పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. మానవత్వం నింపిన ఈ సేవా కార్యక్రమంలో వార్డు వైఎస్ఆర్సీపీ నాయకులు ఎదురు సత్యనారాయణ, మడక అప్పారావు, సంపత్, దేవర రమేష్, ఎడ్ల సత్యనారాయణ, అర్జున్, కోరాడ వాసు, కోరాడ శ్రీను, నందిని, చందు రెడ్డి, శోభన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శాంతిగిరి కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్, మాజీ ప్రెసిడెంట్ మొల్లి శ్రీనివాస్, ప్రసాద్, బుడి మల్లేష్, శ్రీను తదితరులు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించడంలో సహకరించారు. అగ్ని ప్రమాద బాధితులకు ఇలాంటి ఆర్థిక, ఆత్మీయ సహాయం అందించిన 59వ వార్డు వైఎస్ఆర్సీపీ నాయకులు స్థానికంగా ప్రశంసలు అందుకున్నారు.

# జీవీఎంసీ 91వ వార్డ్ పరిశీలకుడిగా ఆళ్ల పైడ్రాజు నియామకం

**డాక్టర్ మల్ల విజయప్రసాద్ కి కృతజ్ఞతలు తెలిపిన పైడిరాజు**



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 24 :** మాజీ శాసనసభ్యులు డాక్టర్ మల్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో ఈరోజు 91వ వార్డుకు పరిశీలకుడిగా నియమితులైన పైడిరాజు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పైడిరాజు ప్రమాణం చేశారు.

తన నియామకంతో 91వ వార్డులోని కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ, పార్టీ అభివృద్ధి దిశగా కలిసి పనిచేయడానికి సిద్ధమని పేర్కొన్నారు. నన్ను పరిశీలకుడిగా ఎంపిక చేసి గౌరవపరిచిన డాక్టర్ మల్ల విజయప్రసాద్ మరియు పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు. నా వంతు బాధ్యతను నిబద్ధతతో క్రమశిక్షణతో నిర్వర్తిస్తూ పార్టీ జెండా ఎగురవేయడానికి కృషి చేస్తానని పైడిరాజు తెలిపారు. సమాజ సేవ, పార్టీ శ్రేయస్సు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పైడిరాజుని శుభాకాంక్షలు తెలియజేస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# జోన్ 8 ప్రజా ఫిర్యాదుల వేదికలో 18 ఫిర్యాదులు స్వీకరణ

**సత్వర పరిష్కారానికి అధికారులకు జెడ్‌సి శంకర్రావు ఆదేశాలు**







**వేపగుంట, పెన్ పవర్, నవంబర్ 24 :** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని జోన్ 8 వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)లో ఈరోజు మొత్తం 18 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. స్థానిక ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వేదికను పర్యవేక్షించిన జోనల్ కమిషనర్ శంకర్రావు సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శాఖవారీగా వచ్చిన ఫిర్యాదులు..టౌన్ ప్లానింగ్ విభాగం 5, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ (ఈఈ) 4, ఈఈ ఎలక్ట్రికల్ 2, వాటర్ సప్లై విభాగం ఏఈ1, ఏఎంహెచ్ఓ (ఆరోగ్య విభాగం) 2, రెవెన్యూ విభాగం 3 యూజీడి 1, ప్రజలు ప్రధానంగా అనధికార నిర్మాణాలు, రోడ్ల మరమ్మతులు, తాగు నీటి సరఫరా లోపాలు, డ్రైనేజీ సమస్యలు, ఆరోగ్య సమస్యలు, పన్నుల వివాదాలు వంటి అంశాలను ప్రస్తావించినట్టు అధికారులు వెల్లడించారు.

నిర్ణీత గడువులో పరిష్కారం–జోన్ కమిషనర్ ఆదేశాలు..

ఫిర్యాదుల స్వీకరణ అనంతరం మాట్లాడుతూ జోనల్ కమిషనర్ శంకర్రావు, ప్రతి ఫిర్యాదును నిర్ణీత సమయంలో పరిష్కరించి, నివేదికను సమర్పించాలి. ప్రజలకు ఇబ్బందులు రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. వేదికలో పాల్గొన్న సంబంధిత విభాగాల అధికారులు ప్రజలకు స్పందిస్తూ, ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకుని, త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా ప్రతి ఫిర్యాదుపై ఫీల్డ్ విజిట్లు నిర్వహించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వేదిక





**60 ఫిర్యాదుల స్వీకరణ..సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ సూచనలు**

**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 24 :** స్థానిక అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో మొత్తం 60 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వం వహించారు. ఫిర్యాదుల వివరాలు..ఈరోజు అందిన ఫిర్యాదుల్లో భూ తగాదాలు 26, కుటుంబ కలహాలు 3, మోసాలకు సంబంధించినవి 2, ఇతర విభాగాలకు చెందిన 29 ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఎస్పీ తుహిన్ సిన్హా సంబంధిత అధికారులతో సమావేశమై ప్రతి ఫిర్యాదును పూర్తిగా పరిశీలించి 7 రోజులలో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఫిర్యాదు వెనుక ఉన్న వాస్తవాలను నిశితంగా గుర్తించి, అవసరమైనచో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ఫిర్యాదుదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి..**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత. ప్రజా సమస్యల పరిష్కారంలో అనకాపల్లి జిల్లా పోలీసులు శ్రద్ధ, నిబద్ధతతో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదుకూ సముచిత పరిష్కారం లభించేలా చర్యలు కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవ ప్రసాద్, ఎల్. మోహనరావుతో పాటు పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, విచారణ ప్రక్రియలను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు సమాచారం. అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ తరచూ నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాలు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వేగవంతమైన పరిష్కారం చూపడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ దాడి రమేష్





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 24 :** స్థానిక పశ్చిమ నియోజకవర్గం, జీవీఎంసీ 89వ వార్డు పరిధిలోని కొత్తపాలెం, దుర్గానగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఘనంగా జరిగింది. మొత్తం రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, కాలువల విస్తరణ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్, జివిఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు దాడి వెంకట రమేష్ భూమిపూజ నిర్వహించారు. ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలు, నీటి నిల్వలు, కాలువల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని, 89వ వార్డు మొత్తం అభివృద్ధి చెందేలా చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు, వార్డు ప్రధాన కార్యదర్శి గవ్వ భాస్కర్, దాడి సురేష్ ఏ.పల్నాడు రవణరావు రామారావు, పైడ్రాజు, చందు, ఆదిలక్ష్మి, శ్రీరాములు తదితర స్థానిక పెద్దలు పాల్గొన్నారు. ప్రాంత ప్రజలు అభివృద్ధి పనుల ప్రారంభంపై సంతోషం వ్యక్తం చేస్తూ, కార్పొరేటర్ రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం స్థానికంగా ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# జిల్లాలో ప్రతి గ్రామాన్ని సాంకేతికతతో అనుసంధానం చేయాలి.

- **అందుకు అనుగుణంగా కొత్త మొబైల్ టవర్ల నిర్మాణం**
- **జిల్లా కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్**

**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 24:** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి సాంకేతికతను మరింత అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ లో మూడు ఐటిడిఏ పిఓలు, సబ్ కలెక్టర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, మండల రెవెన్యూ అధికారులతో వర్చువల్ గా వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు ముడిపడి ఉన్నటువంటి సాంకేతికలు సమస్యలను అధిగమించడానికి సెల్ టవర్ లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సెల్ టవర్ నిర్మాణాలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెల్ టవర్ నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించాలని, భూ సమస్యలను అధిగమించడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనువైన ప్రదేశాలు లేని చోట అటవీ శాఖ పర్మిషన్ తో అటవీ స్థలాలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్, జియో ఎయిర్టెల్ యొక్క టవర్ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. ఇంకా ఏయే ప్రదేశాల్లో కొత్త టవర్ల నిర్మాణం అవసరమవుతుందో ఆ ప్రదేశాలను గుర్తించి ఒక సమగ్రమైనటువంటి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం ఐటిడిఏ పివో స్మరణ్ రాజ్, చింతూరు ఇంచార్జ్ ఐటిడిఏ పివో శుభం నోఖ్వాల్, పాడేరు ఇంచార్జ్ ఆర్ డి వో ఎస్ విఎస్. లోకేశ్వరావు, సర్వీస్ ప్రొవైడర్లు, పలు మండలాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా, బాలల భద్రత, గంజాయి నిర్మూలనపై కీలక సూచనలు

**సైబర్ మోసాల నియంత్రణపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేక దృష్టి**

**గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్**







**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 24 :** స్థానిక అనకాపల్లి జిల్లా మొత్తం మహిళలు, బాలలు, వృద్ధులు భద్రంగా ఉండేలా, గ్రామ స్థాయి నుంచి పోలీసు శాఖ వరకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి మండలంలో కనిపించకుండా పోయిన మహిళల వివరాలను సక్రమంగా సేకరించి, నమోదు చేసి, వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్లు వంటి సమాచారం డిజిటల్‌గా ధృవీకరించి అప్లోడ్ చేయాలని తెలిపారు. సేకరించిన డేటా జిల్లా పోలీస్ డేటాబేస్‌లో భద్రపడి, భవిష్యత్ ట్రాకింగ్‌కు, సామాజిక భద్రతకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా, బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు అంటూ హెచ్చరిస్తూ, స్లైట్స్ సస్పీషియన్ ఉన్నా వెంటనే సంబంధిత ఎస్హెచ్ఓ లకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు.

గంజాయి సాగు, రవాణా, వినియోగం, మాదకద్రవ్యాలు సంబంధించిన కార్యకలాపాలపై గ్రామ స్థాయిలోనే సమాచారం అందే విధంగా వ్యవస్థ బలపడాలని ఎస్పీ గారు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, అక్రమ రవాణా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని చెప్పారు. గ్రామాల్లో సే నో టు డ్రగ్స్ ప్రచారాలు తరచుగా నిర్వహించి యువతలో అవగాహన పెంచాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన తప్పనిసరి. సైబర్ మోసాలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో అనుమానాస్పద లింకులు, యాప్‌లు, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు పంచుకోవద్దని గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. స్కూల్స్, కాలేజీలు, అంగనవాడీలు, బస్ స్టాండ్లు, జంక్షన్లు వంటి ప్రదేశాల్లో సైబర్ క్రైమ్, మహిళా, బాలల భద్రత, ఎన్డిపిఎస్ నియంత్రణపై రూపొందించిన పోస్టర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు.

అదే విధంగా విద్యార్థులకు శక్తి యాప్ ప్రయోజనాలు వివరించి రిజిస్ట్రేషన్లు చేయించడంలో జిఎంఎస్కెఎస్ ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందించిన ఆరు మంది గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. అందులో అనకాపల్లి టౌన్ కె. ఉమా, కసింకోట పి.నయోమి, ఎలమంచిలి రూరల్ పి. వీరలక్ష్మి, పరవాడ ఎం.అరుణ, మాకవరపాలెం ఈ.రాజేశ్వరి, నాతవరం పి.లలిత ఈ ఆరుగురికి ఆయన ప్రశంసాపత్రాలు మరియు నగదు బహుమతులు అందజేసి, గ్రామ స్థాయిలో చేస్తున్న సేవలను అభినందించారు.

ఎస్పీ మాట్లాడుతూ ఎస్హెచ్ఓఎస్, జిఎంఎస్కెఎస్, గ్రామ సిబ్బంది కలిసి మహిళా, బాలల భద్రత, ఎన్డిపిఎస్ చర్యలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్రంగా పనిచేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా ఎస్హెచ్ఓలను నేరుగా సంప్రదించండి. గ్రామస్థాయి నుంచి సమాచారం వేగంగా రాగానే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఎస్.బి. ఇన్స్పెక్టర్లు బాలసూర్యరావు, లక్ష్మి మరియు వివిధ మండలాల గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రైతన్నలకు పంచు సూత్రాలు.





- .రైతన్నలకు వ్యవసాయ అభివృద్ధి చేసేందుకు అన్నదాతలకు మేలు చేకూర్చేలా పంచ సూత్రాలు.
- ప్రతి రైతును భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమం.
- కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే %డ% ప్రభుత్వ విప్,తోయక్క జగదీశ్వరి.

**గుమ్మలక్ష్మీపురం నవంబర్ 24. పెన్ పవర్.**రైతన్న సేవలో.మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్.గరుగుబిల్లి మండలం,ఉల్లిభద్ర గ్రామంలో సోమవారం నాడు రైతన్న సేవలో..మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేస్తూ అన్నదాతలకు మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. సాగునీటి యాజమాన్యంలో మేటి,90%సబ్సిడీపై బిందు సేద్యం,సబ్సిడీపై మెరైన విత్తనాలు,ఉద్యాన రైతులకు ఉజ్వల భవిత,పొలం పిలుస్తుంది,ప్రకృతి వ్యవసాయం,వ్యవసాయ యాంత్రీకరణ,పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం,ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ,సంచార రైతు బజార్లు వంటి అంశాలపై రైతులకు అవగాహన పరచడం జరిగిందని.ప్రతి రైతును భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా,కూటమి ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమం మరియు ముఖ్యంగా అన్నదాత సుఖీభవ రెండు విడతల ప్రయోజనాలను గురించి వివరించి,రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు . కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు,రాష్ట్ర డైరెక్టర్స్ అక్కేన మధుసూదన్ రావు,అంబటి రాంబాబు,మండల కన్వీనర్ మరడాన నారాయణ స్వామి నాయుడు,నాయకులు సచివాలయం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్య సేవలకు చిరస్మరణ

**డా.ప్రకాష్‌రావు పార్థివదేహానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ నివాళి**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 24 :**పేదల వైద్యుడిగా, నిస్వార్థ ప్రజాసేవకుడిగా నిలిచిన 20 రూపాయల డాక్టర్ పేరుతో ప్రసిద్ధి పొందిన డాక్టర్ ప్రకాష్‌రావు పార్థివదేహానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ రైల్వే న్యూ కాలనీ వద్ద పూలమాలలు అర్పించి ఘనంగా నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విశాఖ జిల్లాలో లక్షలాది మందికి అందిం చిన వైద్యసేవలు చిరస్థాయిగా ప్రజల హృద యాల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. కార్యక్ర మంలో పెద్దలు జగదీశ్, శివగణేష్, నాగమణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.తరువాత ఎంవీపీ కాలనీ సెక్టర్%-%1లో బొలిశెట్టి సత్యనా రాయణ (సత్య) సతీమణి, కీర్తిశేషులు బొలిశెట్టి నాగమణి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే రమేష్, ఎన్డీఏ మహాకూటమి నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పటిష్ట నిర్మాణానికి కృషి.




**జిల్లా కమిటీలు నియామకానికి సిఫార్సులు.**
**జిల్లా పరిశీలకుడు దెబాసిస్ పట్నాయక్.**

**అరకులోయ పెన్ పవర్ 24:**కాంగ్రెస్ పార్టీలో జిల్లా కమిటీ అధ్యక్షుడు నియామకానికి జిల్లాలోని కొంతమంది నాయకులను సిఫార్సు చేస్తున్నామని అరకులోయ మండల కేంద్రంలో అక్షయ ఇన్ హోటల్లో అల్లూరి జిల్లా పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శతక బుల్లిబాబు అధ్యక్షతన సోమవారం కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించామని వారు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవాన్ని తీసుకురావటానికి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా నిర్మాణాత్మక చర్యలు చేపట్టడానికి, ప్రతి జిల్లాలో జిల్లా అధ్యక్షులు నాయకులను ఎన్నుకోవటానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేస్తున్నామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని, అల్లూరి, మన్యం జిల్లా పరిశీలకుడుగా పర్యటిస్తున్నారని వారు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఆదేశాలతో ప్రతి జిల్లాలో కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా నియామకానికి సిప్పర్సులు చేస్తున్నామని, జోడోయాత్రలో భాగంగా దేశంలో పార్టీని ముందుకు తీసుకువెళ్లటానికి రాహుల్ గాంధీ ప్రయత్నం చేస్తున్నారని, వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిసిసి అధ్యక్షురాలు నోగేలు చంద్రకళ ,వెంకట్ పిసిసి ఇన్చార్జ్, గంగాధర్ స్వామి అరకు నియోజకవర్గ ఇన్చార్జ్, పాంగి గంగాధర్ కిసాన్ కాంగ్రెస్, డివైసీ ప్రేమ్ కుమార్ డివైసీ ప్రెసిడెంట్, ఓపిసి చైర్మన్ ప్రవీణ్ కుమార్, పార్టీ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ 90వ వార్డ్‌లో అభివృద్ధి పనులు వేగవంతం

**వార్డులో కార్పొరేటర్ బొమ్మిడి రమణ పర్యటన**






**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 24 :** జీవీఎంసీ 90వ వార్డ్, లక్ష్మీనగర్, ఎఫ్ బ్లాక్‌లో జరుగుతున్న రోడ్లు మరియు కాలువల అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ బొమ్మిడి రమణ స్వయంగా సందర్శించి పరిశీలించారు. గతంలో శంకుస్థాపన చేసిన రూ.20 లక్షలు మరియు రూ.37 లక్షల విలువ గల రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో పరిశీలిస్తూ, పనుల నాణ్యతపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంలో పబ్లిక్ వర్క్స్ విభాగానికి చెందిన ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, అధికారులైన శ్రీను, అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు కరిమిజ్జి జ్యోతి, గాడు వెంకటలక్ష్మి, పోతల సతీష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక నివాసితులు కూడా పర్యటనలో భాగస్వాములయ్యారు. పనులు నిరవధికంగా, ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు అందుబాటులోకి రావాలని అధికారులు మరియు కాంట్రాక్టర్లకు కార్పొరేటర్ రమణ సూచించారు. ప్రజల సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కారం కావడం తమ కర్తవ్యం అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆర్వి నగర్ లో గిరిజనుల ర్యాలీ





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలానికి చెందిన చుట్టుప్రక్కల గిరిజనులు మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆర్వి నగర్ లో ఘన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ మావోయిస్టులు గిరిజనులకు కలిగిస్తున్న అన్యాయం మరియు నష్టాలను చర్చించారు.ర్యాలీకి చుట్టుప్రక్కల గిరిజన గ్రామాల ప్రజలు భారీగా హాజరయ్యారు.కార్యక్రమంలో ఆర్వి నగర్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని గిరిజనులు స్వచ్ఛందంగా నిర్వహించారు.

# అసరాడలో 'రైతన్న - మీకోసం' కార్యక్రమం!






**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 24:**మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో శనివారం (24 -11- 2025 నుండి 29 - 11- 2025) వరకు 'రైతన్న - మీకోసం' కార్యక్రమం నిర్వహించబడనుందని మండల వ్యవసాయ అధికారి డి.గిరిబాబు తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖ అధికారులు ప్రతి రైతు ఆధార్ నెంబర్ ఆధారంగా ఆ రైతుకి కావాల్సిన వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఇతర సహాయక వస్తువులను ఆన్లైన్ ద్వారా అందించగలరని చెప్పారు. అదేవిధంగా,పంచ సూత్రాలు - నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్,ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుండి మద్దతు మరియు పాడి రైతులకు అండ %-% వంటి ముఖ్యమైన అంశాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు.సోమవారం అసరాడలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి మండల అభివృద్ధి అధికారి రమణ బాబు,తహసీల్దార్ హెచ్.అన్నాజీరావు,వ్యవసాయ సంచాలకులు బి.తిరుమల రావు మరియు చింతపల్లి వ్యవసాయ అధికారి టి. మధుసూదన్ రావు, రింతాడా సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, పెద్దలు బొబ్బిలి వెంకట రావు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా రైతులు ఆధునిక సాగు పద్ధతులు, సరైన మార్కెట్ లింకులు మరియు ప్రభుత్వ సహాయాలను తెలుసుకోవడం ద్వారా వ్యవసాయం లాభదాయకంగా మార్చుకోవచ్చు.

# నామా కొండబాబు కృషితో 25 సంవత్సరాల రైతుల కష్టాలకు మోక్షం

**తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 24:**తాడిపూడి గ్రామంలో ఉన్న పుంత రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉండడంతో అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, తాడిపూడి సొసైటీ అధ్యక్షులు నామా వెంకట సుబ్బారావు(కొండబాబు) కృషితో జడ్పీ నిధులనుండి 10 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళితే..తాళ్లపూడి మండలం తాడిపూడి, ఏలూరు జిల్లా గూటాల గ్రామాల సరిహద్దు పుంత రోడ్డు గత 25 సంవత్సరాల నుండి పెద్ద పెద్ద గోతులతో దుర్భర స్థితిలో ఉండడంతో ఇరు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. రైతులు పొలాలకు వెళ్లాలన్నా ఈ మార్గం ద్వారానే అనేక అవస్థలు పడుతూ వెళ్లవలసి వచ్చేది. రెండు జిల్లాల సరిహద్దు రోడ్డు కావడంతో ఎవరికివారే.. యమునాతీరే.. అన్నట్టు ఉండేది. ఈ రోడ్డు పరిస్థితి అయితే ఇరు గ్రామాల రైతులు, ప్రజల కష్టాన్ని చూసిన నామా కొండబాబు కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, జెడ్పి చైర్మన్ తదితర సంబంధిత అధికారులు సహకారంతో జిల్లా పరిషత్ నిధుల నుండి 10 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ గూటాల గ్రామం వెళ్లాలన్న, మా పొలంలోకి వెళ్లాలన్న 25 సంవత్సరాల నుండి ఇదే దారి గుండా అనేక వ్యయప్రయాసలు పడుతూ వెళ్లే వాళ్ళమని, కొండబాబు కృషితో రోడ్డు పూర్తయితే ఆయనకు రుణపడి ఉంటామన్నారు.ఇలాంటి నాయకుడు ప్రతి గ్రామంలో ఉండాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గూటాల వైస్ ప్రెసిడెంట్ కరిబండి శ్రీనివాస్, సిద్ధన రాధాకృష్ణ, నామా సురేంద్ర, తిరుమలశెట్టి సత్యనారాయణ, చెన్నా శ్రీనివాస్, వీరిశెట్టి రాంబాబు, చింతపల్లి బుజ్జి, భీమరాజు, నామా రంగ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమం విజయవంతం

- పాడేరు మండలంలో రైతుల సమస్యలపై ముఖాముఖి
- ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ఐటిడిఎ పిఓ శ్రీ పూజిత



**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 24:** పాడేరు మండలంలో రైతుల సమస్యలపై ముఖాముఖి కార్యమంలో పాల్గొన్న ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ఐటిడిఎ పిఓ శ్రీ పూజిత గిరిజన ప్రాంత రైతుల సంక్షేమం లక్ష్యంగా చేపట్టిన 'రైతన్న మీకోసం' కార్యక్రమం పాడేరు మండలంలో విజయవంతంగా జరిగింది. స్థానిక తుంపాడ రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
వాతావరణ మార్పులకు అనుగుణంగా తీసుకోవాల్సిన పంట జాగ్రత్తలు, కొత్త రకాల విత్తనాల వినియోగంపై వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాల గురించి, వాటిని పొందే విధానం గురించి పూర్తి వివరాలను తెలియజేశారు. ఎరువులు, పురుగు మందుల సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు తోడ్పడే సేంద్రీయ వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా మాట్లాడిన రైతులు, తమ ప్రాంతంలో ఉన్న నీటిపారుదల సమస్యలు, పంటలకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం వంటి ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.
తుంపాడ రైతు సేవా కేంద్రం అధికారి మాట్లాడుతూ, రైతుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం రైతులకు, అధికారులకు మధ్య మంచి వారధిగా నిలిచిందని పేర్కొన్నారు.

# 24 నుంచి 29 వరకు "రైతన్న మీకోసం" కార్యక్రమం





- వ్యవసాయ అనుబంధ శాఖలు, రైతు సేవా కేంద్రంలో రైతులు తమ పంట వివరాలు నమోదు చేసుకోవాలి.
- ముంచంగిపుట్టు మండల వ్యవసాయశాఖ అధికారి గిరిడ మురళీకృష్ణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 24.** ఈనెల 24 నుంచి 29 తేదీ వరకు "రైతన్న మీకోసం" కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి గిరిడ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో మాకవరం పంచాయతి కేంద్రంలో, లక్ష్మీపురం పంచాయతీ కర్లపోదోరు, కించాయిపుట్టు పంచాయతీ ముంచంగిపుట్టు తదితర గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించమన్నారు. మండల పరిధిలో గల అన్ని రెవెన్యూ గ్రామాల రైతులు తమ పంట వివరాలు రైతు సేవా కేంద్రంలో, వ్యవసాయ అనుబంధ శాఖల్లో నమోదు చేసుకోవాలన్నారు. సోమవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమాలలో రైతులకు ప్రస్తుత పంట దిగుబడులు, పంట మార్పిడి ద్వారా అధిక ఆదాయం, మార్కెట్ సదుపాయాలు గూర్చి వివరించమన్నారు. రైతులకు ఎక్కువ ఆదాయం తెచ్చే ఉద్యాన పంటలైన కాఫీ, పసుపు, పళ్ళు, కూరగాయలు వాటి లాభాల గూర్చి వివరించమన్నారు. ప్రకృతి సేద్యం వలన లాభాలు గూర్చి అవగాహన కల్పిస్తూ.. రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించమన్నారు. అదే విధంగా రైతుకు కావలసిన స్ప్రేయర్లు, టార్పాలిన్లు, ఇంజన్లు, ఎంత మేరకు అవసరం అని రైతులు దగ్గర సమాచారం సేకరించమన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల రైతులకు ఈ సర్వే ద్వారా వారికి కావలసిన పనిముట్లను అందించే కార్యక్రమం చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, బాబ్జీ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సీలేరులో సందడిగా రవితేజ సినిమా షూటింగ్

- హీరో రవితేజను చూసేందుకు బార్లు తీరిన అభిమానులు




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని సీలేరులో సినీ అగ్రహీరో మాస్ మహారాజా రవితేజ సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో యువ దర్శకుడు శివ రూపొందిస్తున్న ఈ కొత్త సినిమా కోసం ముహూర్తపు షాట్ ను రవితేజ మొదట మారెమ్మ తల్లి ఆలయంలో పూజలతో ప్రారంభించారు. తదుపరి, ఇంటెక్ డ్యాం మరియు సీలేరూ రెగ్యులేటర్ డ్యాం / గుంటవాడ రిజర్వాయర్ వద్ద పలు సన్నివేశాలను చిత్రీకరించారు. స్థానికులు హీరోను చూసేందుకు భారీగా వచ్చి, బార్లు తీరారు.చాలా సంవత్సరాల తర్వాత ఇంత పెద్ద సినిమా సీలేరులో జరగడం స్థానికులలో సంతోషాన్ని రేకెత్తించింది. స్థానికులను కూడా సినిమా చిత్రీకరణలో అవకాశాలు ఇచ్చారు. సీలేరూ, మోతుగూడెం, దారకొండ పరిసర ప్రాంతాలలో ఇటీవల తరచూ సినిమా షూటింగ్లు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో అందమైన ప్రదేశాలు ఉండటంతో, అలాగే స్థానికులు పలు సినిమాల్లో నటించటం వలన షూటింగులు విరివిగా జరుగుతున్నాయి.

# హొటల్లో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలి బూడిదైన రిసెప్షన్
- తప్పిన పెను ప్రమాదం
- మ్రోగని ఎమర్జెన్సీ అల్లారం !హొటల్ సిబ్బందికి ఫైర్ అండ్ సేఫ్టీ పై శిక్షణ అవసరం








**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 24:**జీవిఎంసీ జోన్ 2 పరిధి ఆరిలోవ శ్రీకాంత్ నగర్ లో ఎస్ వి ఏ హొటల్ సార్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. సెల్లార్ లో గల రిసెప్షన్ సర్క్యూట్ బోర్డ్ అగ్నికి కాలి బూడిదయింది.హొటల్ గదిలో ఉన్న వారిని సిబ్బంది అప్రమత్తం చేయడంతో వారు హొటల్ నుండి బయటకు పరుపు తీశారు. హొటల్ కు సంబంధించి ఫైర్ అండ్ సేఫ్టీ ఉన్నప్పటికీ ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన లేకపోవడంతో నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి తెలిపారు. ఈ ఘటనతో సమీప ప్రాంత ప్రజలు మంటలను కొంతమేర కట్టడి చేశారు.అగ్నిమాపక సిబ్బంది హొటల్ పరిసర ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.సచివాలయం సిబ్బంది అగ్నిమాపక,పోలీస్ అధికారులకు సమాచారం తెలియజేశారు.అగ్నిమాపక సిబ్బంది,పోలీస్ అధికారులు జరిగిన ఘటనపై విచారణ చేపడతామని అన్నారు.

## హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ ట్రోఫీ ఆవిష్కరణ



**విశాఖ పెన్ పవర్ నవంబర్ 24:**తమిళనాడులోని చెన్నై, మదురైలలో ఈనెల 28 నుంచి డిసెంబర్ 10 వ తేదీ వరకు జరగనున్న హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ ట్రోఫీని అంకోసా భవనంలో ఎమ్మెల్యేలు పెద్దలు గంటా శ్రీనివాస్ , వెలగపూడి రామకృష్ణ బాబు, పి. విష్ణుకుమార్ రాజు లతో కలిసి ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1925 నవంబర్ 7 న స్థాపించిన ఇండియన్ హాకీ ఫెడరేషన్ వందేళ్ల పూర్తయిన సందర్భంగా హాకీ క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.. జింబాబ్వే, శ్రీలంక వంటి అనేక చిన్న దేశాలకు క్రీడతోనే ప్రపంచ వ్యాప్తంగా ప్రాముఖ్యం దెందాయని అన్నారు.. 1928 నుంచి 1980 మధ్య హాకీలో భారత్ 8 ఒలింపిక్స్ బంగారు పతకాలు సాధించిందని.. మళ్లీ హాకీకి పూర్వ వైభవం తీసుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న నిర్వాహకులు, కూటమి నేతలు పాల్గొన్నారు...

## కొత్తగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఘనత.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తగూడ,గిరిజన సంక్షేమ ఉన్నత ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.



**గుమ్మలక్ష్మీపురం నవంబర్ 24 పెన్ పవర్.**రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ ఎస్.జి.ఎఫ్.ఐ స్కూల్ గేమ్స్ అండర్ 17 బాలుర %ం%బాలికల విభాగంలో గుమ్మలక్ష్మీపురం మండలం కొత్త గూడ,ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల,విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు బి శ్రీనివాసరావు అన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.2025 సెప్టెంబర్,11,జిల్లా స్థాయి ఎస్,జి,ఎఫ్,ఐస్కూల్ గేమ్స్ విజయనగరం విజయ్ క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో ఫెన్సింగ్ అండర్ 17 బాలుర%ం%బాలికల విభాగంలో కొత్తగూడ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు హారిక చరణ్,మండంగి అఖిల్ చంద్ర దేవ్,ముండంగి శరత్ బాబు,బిడ్డిక ఆదిత్య వర్ధన్,బిడ్డిక ప్రవీణ్ కుమార్,కనబరిచి.2025 నవంబర్25నుండి26న డాక్టర్ బి.ఆర్అంబేద్కర్,కోనసీమ జిల్లాలో జడ్పీ హై స్కూల్ లోజరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని అన్నారు.విద్యార్థులు ఇంతటి ఘనత సాధించడానికి గల కారకుడైన ఫిజికల్ డైరెక్టర్ ఎన్ మాధవరావు.మరియు ప్రోత్సహించిన వార్డెన్ అప్పారావు.ను పాఠశాల సిబ్బంది ఎస్ఎంసియి ఛైర్మన్ వారికి అభినందనలు తెలిపారు.

## గొచ్చారి లో రైతన్న మీకోసం కార్యక్రమం...!



**హుకుంపేట పెన్ పవర్ నవంబర్ 24:** అల్లూరి సీతారామ జిల్లా హరిప్రియ అల్లూరి సీతారామ జిల్లా హుకుంపేట మండలం గోచేరి గ్రామంలో గూడా సర్పంచ్ కండిబి సరోజ కుమారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రైతన్న మీకోసమే కార్యక్రమం నిర్వహించారు. పంటల గురించిఅవగాహనలు అనేక అవగాహనలు పంచ సూత్రాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో అరకు ఏఎంసి వైస్ చైర్ పర్సన్ కండిబి మరియు సచివాలయం సిబ్బంది అధికంగా పాల్గొన్నారు

## కాకినాడ రైల్వే సిబ్బంది-చేతుల మీదుగా చిన్నారులకు దుప్పట్లు, రగ్గులు

- బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లక్కోజి నాగభూషణం



**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 24 :-** చింతపల్లి పరిసర గ్రామాల్లో శీతాకాలం ప్రారంభమైన వెంటనే చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది ముందుకు వచ్చి ఉన్ని దుస్తులను ఉచితంగా పంపిణీ చేసినట్లు బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లక్కోజి నాగభూషణం తెలిపారు. సోమవారం ఉదయం కాకినాడ నుండి ప్రత్యేకంగా వచ్చిన సి %ం% దబ్బా దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది, చింతపల్లి పంచాయతీ పరిధిలోని కందులగది, గూడెం మండలంలోని తీములబంద, ఊబపాలెం గ్రామాల్లోని చిన్నారులకు స్వెటర్లు, దుప్పట్లు, రగ్గులు వంటి ఉన్ని దుస్తులను స్వయంగా అందజేశారు. మొత్తం 50 మంది చిన్నారులకు ఉన్ని దుస్తులను అందించినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల పేద చిన్నారులకు కొంతైనా తోడ్పాటు అందించాలన్న సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టాం అని వారు పేర్కొన్నారు. రైల్వే సిబ్బందిచేసిన ఈ మంచి సేవకు గ్రామ ప్రజల తరఫున, తన తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు లక్కోజి నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. సత్య ప్రసాద్, రాజుబాబు, ఏవి. రావు, ఈశ్వర్ రెడ్డి, పనింద్ర యాదవ్, ఎల్.ఎస్. గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో ఎఫ్ఐహెచ్ జూనియర్ హాకీ వరల్డ్ కప్ ట్రోఫీ సంబరాలు

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఎం.పి మతుకుమిల్లి శ్రీభరత్





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 24 :**ఎఫ్ఐహెచ్ హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ గ్రాండ్ ట్రోఫీ సంబరాలు విశాఖలో అద్భుతంగా నిర్వహించబడ్డాయి. హాకీ విశాఖపట్నం ఆధ్వ ర్యంలో అమ్మోసా ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ వేడుకలో విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ గారు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఎం.పి.భరత్ ట్రోఫీని ఆవిష్కరిస్తూ మాట్లాడు తూ, హాకీ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ముఖ్యంగా విశాఖపట్నం చేస్తున్న కృషి ప్రశంస నీయమని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి జూని యర్ వరల్డ్ కప్ ట్రోఫీ విశాఖకు రావడం నగర క్రీడాభిమానుల గౌరవ ప్రతీకగా అభివర్ణించారు. యువ హాకీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు, హాకీ విశాఖపట్నం నిర్వాహకులు, కోచ్‌లు, ప్లేయర్లు, అనేక మంది క్రీడాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కించాయిపుట్టు పంచాయతీలో నీరు, పారిశుద్ధ్య కమిటీ ఏర్పాటు

* పంచాయతీ అభివృద్ధి అధికారి లక్కోజి సింహాచలం.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 23.**
మండలంలో గల కించాయిపుట్టు గ్రామ పంచాయితీలో అన్ని గ్రామాలలో గ్రామ నీరు మరియు పారిశుద్ధ్య కమిటీ (విడబ్ల్యూఎస్సి) ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయితీ అభివృద్ధి అధికారి లక్కోజి సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాలలో మంచినీటి కల్పన ధ్యేయంగా పనిచేస్తున్నామని, వి డబ్ల్యూఎస్సి కమిటీకి శిక్షణ ఇచ్చి గ్రామాలలో మంచినీటి, పారిశు ద్ధ్యం విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కమిటీకి తోడుగా ఇంజనీరింగ్ అసిస్టెంట్, నవనిర్మాణ సమితి ఉంటుందన్నారు. విడబ్ల్యూఎస్ సి చైర్మన్ గా పంచాయతీ సర్పంచ్, కన్వీనర్ గా పంచాయతీ అభివృద్ధి అధికారి ఉంటారని తెలిపారు. గ్రామాల్లో డస్ట్ బిన్ లు ఏర్పాటు చేస్తామని, ఎవరికైతే డస్ట్ బిన్ లు లేవో తమను సంప్రదించాలని గ్రామ ప్రజలను సూచించారు. గ్రామాలలో విద్యా వైద్యంపై దృష్టి పెట్టాలని, గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, అనారోగ్యం వస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్ళనన్నారు. గర్భిణీ స్త్రీలు ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేటట్టు చూడాలని ఆశ వర్కర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో నవనిర్మాణ సమితి ప్రతినిధి శ్రీనాథ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లింగ వివక్ష నిర్మూలనకు విస్తృత అవగాహన

నెల రోజుల జెండర్ క్యాంపెయిన్ పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 24 :**లింగ ఆధారిత వివక్షను అరికట్టేందుకు సమా జంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిం చాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎ న్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అవగాహన తో కూడిన సమన్విత కృషి ద్వారానే నివారణ చర్యలు బలపడతాయని ఆయన అభిప్రాయప డ్డారు. స్త్రీ,పురుష సమానత్వం సాధించినపు డు మాత్రమే సమాజం వేగంగా అభివృద్ధి చెందు తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.కేంద్ర గ్రామీణా భివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు 'నయీ చేతన 4.0 %-% మార్పు కోసం ముందడుగు' పేరుతో జరగనున్న జెండర్ క్యాంపెయిన్‌కు సంబంధించి సిద్ధం చేసిన ప్రచార పోస్టర్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాలుగు వారాలపాటు జరగనున్న ఈ ప్రచార కార్యక్రమం గ్రామ, మండల, నియోజకవర్గ మరియు జిల్లా స్థాయిల్లో విస్తృతమైన చైతన్య కార్యక్రమాలతో కొనసాగుతుందని తెలిపారు. పంచాయతీరాజ్, శిశు సంక్షేమ, పోలీస్ శాఖ, జిల్లా లీగల్ సర్వీసె స్ అథారిటీ, సాంఘిక సంక్షేమ, విద్య, సివిల్ సొసైటీ సంస్థలు, జిల్లా సమాఖ్యలు కీలకంగా పనిచేయాల్సి ఉంటుందని వివరించారు.

మహిళలు, బాలికలలో హక్కులు, భద్రత, ఆర్థిక స్వావలంబన, సాధికారతపై సుదీర్ఘ అవగాహన కల్పించేందుకు ఆన్‌లైన్%-%ఆఫ్‌లైన్ వేదికలలో ప్రత్యేక కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహిం చాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచిం చారు. బాధిత వర్గాలతో నేరుగా సమావేశాలు జరిపి వారి సమస్యలను అర్థం చేసుకుని పరి ష్కారాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో ఈ కార్యక్రమం కోసం సమన్వయకర్తగా డీఆర్డీఏ పీడీ వ్యవహరిస్తారని, అన్ని విభాగాలు సమగ్రంగా సహకరించి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆయన ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, ఏడీసీ వర్మ, ఎన్ఐసి అధికారి పాషా తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయం

**తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 24:**
కాలు జాయింట్ విరిగి, మేజర్ సర్జరీ జరిగిన రాగోలపల్లి గ్రామానికి చెందిన 7వ తరగతి చదువుతున్న ఉద్యార్థి కస్సే సందీప్ మెడిసిన్, వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున 6,000 రూపాయల ఆర్థికసాయం అందజేయడమైనదని సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ తెలిపారు. కష్టాల్లో ఉన్నవారి ఒక్క కన్నీటిబొట్టునైనా తుడవాలన్నదే మానవత ధ్యేయమని అన్నారు. సంస్థ అధిక మొత్తం విద్య, వైద్య సేవల కోసం ఖర్చు పెడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తలారి రామ్మోహన్ మాట్లాడుతూ కష్టాల్లోనూ, ఆపదలోనూ ఉన్నవారు మానవతను ఆశ్రయిస్తే తగు సహాయం చేస్తామని అన్నారు. సంస్థ ఫౌండర్ రామచంద్రా రెడ్డి ఆశయాల మేరకు మానవులకు సేవ చేయడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగుబంటి సనపల రాజశేఖర్, అప్పన వీ రహనుమంతురావు, సాయన సుబ్బారావు తదిరులు పాల్గొన్నారు.

# దక్షిణ నియోజకవర్గంలో కోటి సంతకాల డ్రైవ్ వేగవంతం

* వార్డు అధ్యక్షులతో వాసుపల్లి సమీక్ష



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 24 :**దక్షిణ నియోజకవర్గంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేస్తూ, సేకరించిన ప్రతుల పూర్తి వివరాలను ఎక్సెల్‌లో నమోదు చేసి త్వరిత గతిన సమర్పించాలని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీ నాయకులకు సూచించారు.

ఆసీలమెట్ట కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో 14 వార్డుల అధ్యక్షులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లా డుతూ దక్షిణ ప్రాంతంలో కోటి సంతకాల సేకరణకు ప్రజలు, విద్యార్థులు, మేధావులు విశేష స్పందన చూపారని తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ స్వచ్ఛందంగా సంతకాలు చేయడం ప్రజల ఆవేదనకు నిదర్శనమన్నారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు, రూ. 8,700 కోట్ల తో నిర్మాణాలు ప్రారంభించి వైద్యరంగాన్ని బలోపేతం చేశారని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీక రణకు తీసుకెళ్లే ప్రయత్నం దురుద్దేశపూర్వక మంటూ విమర్శించారు. సేకరించిన ప్రతుల వివరాలను ఎక్సెల్‌లో పూర్తిగా ఫీడ్ చేసి పంపాలని ఆదేశించిన వాసుపల్లి, వార్డుల్లో ప్రజల సమస్యల పరిష్కారమే వైసీపీ లక్ష్యమని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు.కూటమి ప్రభుత్వ వైఫల్యాల ను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని వైసీపీ శ్రేణులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ అభిరెడ్డి అడివిష్ణు, జిల్లా ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్, స్టేట్ ఆర్ టి ఐ సెక్రటరీ దస్మాంతుల వేణుగోపాల్, వార్డు ప్రెసిడెంట్ నీలపు సర్వేశ్వర్ రెడ్డి, పీతల వాసు, దస్మాంతుల మాణిక్యలరావు, దొడ్డి బాపు ఆనంద్, రాజా రెడ్డి, ముత్తబాతల రమేష్, లండ రమణ, మహమ్మద్ షకీల్, 37వ వార్డు ఇంచార్జి గంగళ రామరాజు, గురజారపు రవి, ముజేబ్ ఖాన్, భీశెట్టి ప్రసాద్, జిల్లా స్టూడెంట్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ గరికిన వెంకటేష్, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ మోహన్, కుమార్ లకోజీ, దాస్మంతుల సంతోషి, బాబ్జి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఆయుర్ జీవా ఒక ప్రత్యేక ట్రైనర్‌ను ఏర్పాటు చేసింది.

**విశాఖ పెన్ పవర్ నవంబర్ 24:**సంయుక్తంగా పంచదార్ల గ్రామంలో మహిళల నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఒక ప్రత్యేక ట్రైనర్‌ను ఏర్పాటు చేసింది.

ఆయుర్ జీవా వ్యవస్థాపకురాలు . సుబ్బలక్ష్మి మహిళలకు ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం వివరించారు.

ప్రతి కుటుంబంలోని మహిళ ఆర్థికంగా బలపడాలి, కుటుంబానికి తోడ్పాటు ఇవ్వాలి మరియు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని తెలిపారు. ట్రైనర్ ప్రసన్న సర్ఫ్ మరియు ఫినైల్ తయారీపై అద్భుతమైన శిక్షణ ఇచ్చారు. మొత్తం 30 మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని నైపుణ్యాలను విజయవంతంగా నేర్చుకున్నారు. %꠲ణూ% వ్యవస్థాపకులు నూకరాజు కార్యక్రమం మొత్తానికి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న
. సుబ్బలక్ష్మి, వ్యవస్థాపకురాలు నూకరాజు, వ్యవస్థాపకులు
డా. ఆదిత్య రంగా నాథ్, అధ్యక్షులు జేగన్ పవిత్ర, కసులమ్మ ట్రైనర్ ప్రసన్న మహిళలను శక్తివంతం చేసే అద్భుతమైన కార్యక్రమంగా విజయవంతంగా పూర్తైంది!




## బాయ్స్ హాస్టల్ విద్యార్థులను వేధిస్తున్న సంక్షేమ అధికారులపై తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కు ఆర్ పి ఐ జిల్లా అధ్యక్షుడు నక్కా ఫిర్యాదు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 24:**స్థానిక సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాయ్స్ హాస్టల్ నెంబర్ 1 వసతి గృహం లో విద్యార్థులు టైం కి భోజనం పెట్టమని అడిగినందుకు విద్యార్థులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ స్థానిక 3 టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసులు పెట్టి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని
రిపబ్లికన్ పార్టీ ( బొజ్జాతారకం ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్న రాజు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్లో వినతి పత్రం అందజేశారు.

ఇటీవల ఏ ఎస్ డబ్ల్యూ ఓ, డి ఎస్ డబ్ల్యూ ఓ వసతి గృహానికి వెళ్ళగా హాస్టల్ విద్యార్థులు తమ పై కేసులు పెడుతున్నారని చెప్పినా వినలేదన్నారు. ప్రస్తుతం హాస్టల్ స్టూడెంట్స్ కి పరీక్షలు జరుగుతున్నాయని, భోజనం సరిగ్గా పెట్టడంలేదని అడిగినందుకు మరల పోలీసుస్టేషన్ కి పిలిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులు కూడా సరియైన వసతి, భోజనం విద్యార్థులకు కల్పించాలని వార్డెన్లకు చెప్పారన్నారు. ఈనెల 17న జిల్లా కలెక్టర్ కి స్వయంగా విద్యార్థులే పిర్యాదు చేశారన్నారు. సిబ్బంది కొరత ఉందని, హాస్టల్లో పనిచేయాల్సిన వంట కుక్ ని జిల్లా ఆఫీస్ లో పెట్టు కున్నారన్నారు. సోషల్ వెల్ఫేర్ జిల్లా ఆఫీస్ లో సిబ్బంది కొంతమంది హెడ్ క్వార్టర్ లో ఉండరని, సమయపాలన పాటించారని . దళిత విద్యార్థుల బాగోగులు, భద్రత,సంక్షేమం , భవిష్యత్ ని మంచి మార్గంలో నడ పవలసిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దళిత సంక్షేమం పై కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్న బాధ్యులైన అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకే “రైతన్న మీకోసం”




ఎమ్మెల్యే నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 24:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, సాగును లాభసాటిగా మార్చడమే ఏకైక లక్ష్యంగా 'రైతన్నా మీకోసం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీగా అన్నదాతల ఇళ్లకు వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకుని లాభసాటి వ్యవసాయానికి పలు సూచనలు అందించారు. జగ్గంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గరిమెళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈ నెల 24వ తేదీ నుండి 29 వరకు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా అన్నదాతల ఇళ్లకు వెళ్లివారితో మమేకమవుతారన్నారు. వ్యవసాయంలో రైతులకు ఎదురవుతున్న సమస్యలను, ముఖ్యంగా అధిక పెట్టుబడి, సరైన మార్కెటింగ్ లేమి వంటి సవాళ్లను అర్థం చేసుకోవడం, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించడం, పామాయిలు తోటలో అంతర పంటలు సిపార్స్ మరియు తగిన పరిష్కారాలను సూచించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. రైతుల వద్దకే వెళ్లి వారికి అవగాహన కల్పించడం ద్వారా, ప్రభుత్వ పథకాలు, ఆధునిక సాగు పద్ధతులు మరింత సమర్థవంతంగా క్షేత్ర స్థాయిలో అమలు అయ్యేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోందని దీనిద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం, ఉద్యాన శాఖ అధికారిణి శ్రీవల్లి, వ్యవసాయ సహాయకులు శ్యామ్, సందీప్, వ్యవసాయ ఉద్యాన శాఖల మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమం ప్రారంభం.

**కె గంగవరం పెన్ పవర్ నవంబర్ 24:**కే గంగవరం మండలంలోని 22 రైతు సేవ కేంద్రాల్లో సచివాలయ సిబ్బందితో కలిసి సోమవారం“రైతన్న మీకోసం”కార్యక్రమాన్ని నిర్వహించారు.గంగవరం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వ్యవసాయ సహా అనుబంధ రంగాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.గ్రామ సచివాలయంలోని రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, ఇంజినీరింగ్, ఎనర్జీ విభాగాల అసిస్టెంట్లతో టీంలుగా ఏర్పడి నవంబర్ 24 నుంచి డిసెంబర్ 2 వరకు ప్రతిరోజూ 100 కుటుంబాలను సందర్శించి అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి రైతు“ఏపీ ఎయిమ్స్ 2.0”ను డౌన్‌లోడ్ చేసి నమోదు చేసుకుంటే, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు నేరుగా వారి గడపకు చేరే విధంగా ఈ కార్యక్రమం రూపొందించబడిందని సద్గురుమూర్తి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లూరి దొరబాబు, కొరిపల్లి సుబ్బారావు, కూటమి నాయకులు వివిఏ నవ్య, సుధా, చంద్రశేఖర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.



# రంపచోడవరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఐటిడిఏ కార్యాలయంలో గ్రీవెన్స్ వేదిక



**రంపచోడవరం, పెన్ పవర్,నవంబర్ 24 :** ఏజెన్సీ సమస్యలను గుర్తించి, వాటిని వేగంగా పరిష్కరించేందుకు ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన ప్రజా రంపచోడవరం ఐటిడిఏలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సుమారు 85 దరఖాస్తులు స్వీకరించినట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ తెలిపారు.సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశ హాలులో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శుభమ్ నొక్వాల్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, ఏపీఓ డీఎన్‌వీ రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు గ్రీవెన్స్ నిర్వహించారు.దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి, అర్హులైన వారికి త్వరితగతిన పరిష్కారం అందించాలని ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డీఎల్డీఓ కోటేశ్వరరావు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎడీఏ రామ్మోహన్, పిహెచ్ఓ దేవదానం, మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సరిత, తహసిల్దార్ బాలాజీ, జిసిసి డిఎం జయశ్రీ, ఇంజనీర్ కనకేశ్వరరావు, ఎంపీడీవో ప్రసాద్, ఉపాధి హామీ ఏపీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ బాధిత రైతులను ఆదుకోండి: బికేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా విజ్ఞప్తి



**ప్రత్తిపాడు, పెన్ పవర్ , నవంబర్ 24 :**మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న సమస్యలను పరిష్కరించాలని బికేఎస్ జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్‌ను కోరింది. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్నత అధికారులను కలిసి బికేఎస్ ప్రతినిధులు విజ్ఞప్తిపత్రం అందజేశారు. తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రత్యేక నష్టపరిహారం, అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు, రవాణా ఆలస్యం వంటి సమస్యల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు, సభ్యులు కాకిలేటి వీర్రాజు, కుంచే నాగేశ్వర రావు, దోమాల కృష్ణ జడ్జి తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక పర్యటనలో చిన్నారులను అభినందించిన డైట్ లెక్చరర్





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 24:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి ప్రధాన ప్రాథమిక ఫౌండేషన్ పాఠశాలను మండల పాఠశాలల పరిశీలకురాలు, డైట్ లెక్చరర్ శ్రీమతి ఎల్. చూడామణి శనివారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థుల గుణాత్మక విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న జి ఎఫ్ ఎల్ ఎన్ పరీక్ష విధానం నిర్వహణ, అమలు తీరును ఆమె పరిశీలించారు. తరువాత తరగతులను సందర్శించిన ఆమె, విద్యార్థులు స్వయంగా కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న వంకాయ, గోరుచిక్కుడు, బీరకాయ, బెండకాయ, టమాట, అరటి వంటి మొక్కలను పరిశీలించి చిన్నారుల పట్ల మక్కువ వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు.
ప్రకృతితో అనుసంధానం చేస్తూ విలువలతో కూడిన పాఠ్య బోధన అందిస్తున్న ఉపాధ్యాయుడు శ్యామ్ కుమార్ సేవలను ఆమె మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డైట్ విద్యార్థి నరుకుల జ్ఞానశ్రీ నీలవేణి పాల్గొని విద్యార్థులకు ఆన్లైన్ పరీక్షలు నిర్వహించారు.

# రైతన్న మీ కోసంవారోత్సవాలు..




**అడ్డతీగల,పెన్ పవర్, నవంబర్ 24 :**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశములు మేరకు ఈనెల 24 నుండి 29 వరకు రైతన్న మీకోసం వారోత్సవాలు అడ్డతీగల మండలంలో నిర్వహిస్తున్నట్లు అడ్డతీగల ఎంపీడీవో కుమార్ తెలిపారు . ఈ వారోత్సవాలలో రైతులందరికీ కూడా ప్రతీ ఎకరా కు సాగు నీరు అందించే దిశ గా సమర్ధ నీటి నిర్వహణలో అమలు చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు . నేడు మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మరియు పంటల మార్పిడి పాటించి రాగులు,జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి వాటికి మళ్ళీ డిమాండ్ వచ్చింది, చిరుధాన్యాల సాగు మరింత పెరగవలసి ఉంది అని ఆయన తెలిపారు . వాతావరణ మార్పులను తట్టుకునే పరిష్కార మార్గంగా ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున అవలంభించాలి అని రైతులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందుసేద్యం పై 100% సబ్సిడీనీ రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిం దాని, వ్యక్తిగతంగా రైతులకు యంత్రాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. రైతుల పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలి అని, ఫుడ్ ప్రాసెసింగ్ రంగం దానికి నాంది పలుకుతుంది అన్నారు. కాఫీ, కోకో, కోకోనట్ వంటి పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది అని, రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పి ఎం కిసాన్ పథకం కింద రెండు విడతలలో రైతులందరికీ జమ చేయడం జరిగింది అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఉపశమనంగా ప్రత్యేక నష్టపరిహారం ప్రకటించడం జరిగిందన్నారు.పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి పశు వులకు నీటితొట్టి నిర్మాణం, మెరుగైన వసతి గృహాలు, గోకులాలు , పశు గ్రాశాల పెంపకం, పశు దానా పంపిణీ, ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల టీకాలు అందజేయడం జరుగుతుంది అన్నారు. మాంస ఉత్పత్తికి బ్రెయిలర్ కోళ్ల పెంపకంతో పాటు దేశవాళి కోళ్ల పెంపకం ప్రోత్సహించి, మాంస ఉత్పత్తి, సిద్ధి కేంద్ర స్థాపన విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం జరుగుతుంది అన్నారు. ఈ విషయాలన్నీ కూడా ప్రతి సచివాలయం వారిగా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గ్రూప్ లీడర్ గా , యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అధికారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, సి ఏ ఎస్ ఈ మార్కెట్ కమిటీ మెంబెర్స్ ఈ టీమ్ అంతా కలిసి ప్రతీ రైతు సేవా కేంద్రం వద్ద అందరు రైతులకు పైన తెలిపిన ఆరు రోజులలో అవగాహన కల్పించారుకల్పించారు.

# ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు జనసేన అండ




**పెన్ పవర్ ఉంగుటూరు- నవంబర్ 24:**జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకొని వివిధ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి పార్టీ అండగా నిలుస్తుందంటూ ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. పార్టీ సభ్యులంటే పార్టీకి కుటుంబ సభ్యులేనన్న భావంతో బాధిత కుటుంబాల పట్ల మానవతా దృష్టితో ముందుకు సాగుతున్నామని అన్నారు.
సోమవారం ఆయన ఉంగుటూరులో జరిగిన కార్యక్రమంలో ప్రమాదాల్లో మరణించిన ముగ్గురి కుటుంబాలకు జనసేన పార్టీ తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల పరిహారం చెక్కులను అందజేశారు.
ఉంగుటూరు మండలం చేబ్రోలు కి చెందిన తుంపల శుభాష్, చిలకంపాడు కి చెందిన సత్యనారాయణ, అప్పన్నపేట కి చెందిన అంజూరి మావుళ్ళు వేర్వేరు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబ సభ్యులకు పరిహార చెక్కులను అందజేసి ఆదుకున్నారు.
కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.
ఎల్లప్పుడూ ప్రజల కోసం పార్టీతో పాటు తానే వ్యక్తిగతంగా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే ధర్మరాజు తెలిపారు.

# డాక్టర్ అడ్డాల సత్యనారాయణకు రాష్ట్ర స్థాయి పురస్కారం




**కాకినాడ రూరల్,పెన్ పవర్,నవంబర్ 24:** దంత వైద్య రంగంలో విశిష్ట సేవలందించినందుకు కాకినాడకు చెందిన దంత వైద్య నిపుణుడు, ఐడిఎ కాకినాడ శాఖ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణకు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించింది. విజయ నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి దంత వైద్యుల సదస్సులో ఆయనకు ఈ అవార్డు అందజేశారు.పేదలు, విద్యార్థులు, గ్రామీణ ప్రజలకు ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సమాజ ఆరోగ్యంపై అవగాహన కల్పించినందుకు ఈ గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా డా. సత్యనారాయణ మాట్లాడుతూ:"నోటి ఆరోగ్యం అంటేనే శరీర ఆరోగ్యం.పిల్లల నుండి పెద్దల వరకు ప్రతిఒక్కరూ దంత సంరక్షణపై శ్రద్ధ పెట్టాలి.భవిష్యత్తులో కూడా కాకినాడ మరియు పరిసర గ్రామాల్లో దంతవైద్య సేవలను మరింత విస్తృతంగా అందిస్తాను"అనిపేర్కొన్నారు. ఈ కార్యాచరణలో సహకరించిన ఐడిఎ వైద్యులు డా.వి.వి.రావు,డా.నాగేంద్ర,డా. సిరాజ్,డా.శ్రీవల్లి,డా.మధుమిత,డా. రఘురామ్,ఐఎమ్ఎ వైద్యులు డా.వై. కళ్యాణ్ చక్రవర్తి,డా.చిట్ల కిరణ్, డా. నర్సింగ్,ఆడబాల ట్రస్ట్ సభ్యులు, ఆదిత్య కళాశాల నాయుడు మరియు తేజకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.డా. అడ్డాల రాష్ట్ర స్థాయిలో ఈ పురస్కారం పొందడం పట్ల కాకినాడ నగర ప్రముఖులు,వైద్య వర్గాలు అభినందనలు తెలియజేశారు.

# సీనియర్ పాత్రికేయుడు గుత్తికొండ శ్రీనివాసరావు అకాల మరణం



**పెన్ పవర్ ఉంగుటూరు నవంబర్ 24 :**సీనియర్ పాత్రికేయుడు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ న్యాయవాది గుత్తికొండ శ్రీనివాసరావు(55) అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం మరణించారు. ఆయన ఉంగుటూరు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా పనిచేశారు. గతంలో ప్రజాశక్తితో, వార్త పాటు పలు పత్రికల్లో రిపోర్టర్గా పనిచేశారు. ఆయన మృతికి ఐజేయు జాతీయ కార్యదర్శి సోమ సుందర్, పెన్ పవర్ ఏపీ స్టేట్ బ్యూరో అల్లంశెట్టి శ్రీనుబాబు, ఉంగుటూరు నియోజవర్గ రిపోర్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ, ఉంగుటూరు మండల అధ్యక్షుడు ముప్పన భుజంగరావు, అర్జ వీరస్వామి, భీమవరం ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ కిషోర్, విశ్రాంత న్యాయమూర్తి బొమ్మిడి అప్పారావు తదితరులు భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

# కార్యదర్శి గుండెపోటుతో మృతి





**ఉంగుటూరు, పెన్ పవర్ నవంబర్. 24:**తూర్పు గోదావరి జిల్లా అనంతపల్లి పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఉంగుటూరు గ్రామానికి చెందిన వంగపండు శ్రీదేవి (56) గుండెపోటుతో తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దురదృష్టవశాత్తు గురువారం మృతి చెందారు.
స్వగ్రామం ఉంగుటూరు కు చెందిన శ్రీదేవి గారు గతంలో ఉంగుటూరు మండలంలోని రావులపర్రు, కాగుపాడు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిగా సేవలందించారు. అనంతరం జరిగిన బదిలీలలో భాగంగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అనంతపల్లి పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నారు.
వారి మృతిచెందిన విషయం తెలిసిన ఉంగుటూరు మండలం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు వారి భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ సందర్భంగా విశ్రాంత పంచాయతీ విస్తరణ అధికారి షేక్ సంశుద్దిన్, పంచాయతీ కార్యదర్శులు నేతల విజయ్‌కుమార్, బొడ్డు రవిచంద్రకుమార్, నీలం ప్రసాద్, గిరిధర్ శ్రీనివాసరావు తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# ఓఆర్ ఆర్ అడుగులు...

**గుంటూరు, నవంబర్ 24, పెన్ పవర్:** అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుపై కీలకమైన అప్ డేట్ వచ్చింది. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామాల నుంచి 3ఏ ప్రతిపాదనలు జాతీయ రహదారుల సంస్థ అధికారులకు చేరాయి. కృష్ణా జిల్లా నుంచి కూడా ప్రతిపాదనలు అందనున్నాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఏలూరు, కృష్ణా, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల మీదుగా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ వెళ్లే గ్రామాల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లా నుంచి ప్రతిపాదనలు ఢిల్లీకి చేరాయి. ఒకట్రెండు రోజుల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లా నుంచి కూడా ప్రతిపాదనలు జాతీయ రహదారుల సంస్థకు చేరనున్నాయి. ఆ తర్వాత కొన్ని దశల అనంతరం భూసేకరణ ప్రక్రియ చేపట్టనున్నారు.అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి మరో అప్ డేట్ వచ్చింది. ఏపీ రాజధాని అమరావతి ని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా అమరావతి రైల్వే లైన్, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు , అమరావతి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, అమరావతి క్రికెట్ స్టేడియం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడుతున్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) విషయంలో కీలకమైన అడుగు పడింది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ జిల్లాలలోని 23 మండలాల పరిధిలోని 97 గ్రామాల మీదుగా వెళ్లేలాఅమరావతి ఔటర్ రింగ్ రోడ్డును డిజైన్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల నుంచి అధికారులు ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు.ఈ క్రమంలోనే తాజాగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 3ఏ ప్రతిపాదనలు జాతీయ రహదారుల అధికారుల వద్దకు చేరాయి. కృష్ణా జిల్లా నుంచి ప్రతిపాదనలు రానున్నాయి. ఈ నేపథ్యంలో మరికొన్ని దశలు పూర్తి అయితే.. భూసేకరణ మొదలుపెట్టాలని అధికారులు భావిస్తున్నారు.మరోవైపు 190 కిలోమీటర్ల పొడవుతో అమరావతి రాజధాని చుట్టూ ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని ప్రణాళికలు రచించారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు డీపీఆర్ సైతం ఇప్పటికే ఢిల్లీలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (%చీనాూ×%) వద్దకు చేరింది. 97 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్లనుంది. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి మైలవరం, కంచికచర్ల,, జి.కొండూరు, వీరులపాడు మండలాల మీదుగా ఓఆర్ఆర్ వెళ్తోంది. ఈ మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో ఓఆర్ఆర్ నిర్మాణం జరగనుంది. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ నిర్మాణంపై ఇప్పటికే ఆరు గ్రామాల ప్రతిపాదనలు అధికారులకు చేరాయిఅయితే ప్రతిపాదనల్లో కొన్ని లోపాలు ఉన్నాయనే కారణంతో %చీఎ% అధికారులు వెనక్కి పంపారు. దీంతో రెవెన్యూ అధికారులు వాటిని సరిచేసి, మరికొన్ని గ్రామాల ప్రతిపాదనలను చేర్చి 3ఏ ప్రతిపాదనలు %చీఎ% అధికారులకు పంపించారు. భూమి వివరాలు, సర్వే నంబరులో ఎంత ఉంది.. రహదారి నిర్మాణం కోసం ఎంత భూమిని తీసుకుంటున్నారనే వివరాలు అందులో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలను జాతీయ రహదారుల సంస్థ అధికారులు పోర్టల్‌లో నమోదు చేస్తారు. అనంతరం దిల్లీలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కార్యాలయానికి.. రోడ్లు, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ అధికారులకు పంపిస్తారు.

# మన్యం కాఫీకి భలే భలే డిమాండ్

**విశాఖపట్టణం, నవంబర్ 24, పెన్ పవర్:**మన్యం కాఫీకి అంతర్జాతీయంగా పేరున్న విషయం తెలిసిందే. కానీ రైతులకు సరైన ధర దక్కడం లేదని ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాఫీ కొనుగోలు ధరలను పెంచుతూ రైతులకు తీపి కబురు అందించింది మన్యం ఐటీడీఏ సంస్థ. ఈ మేరకు కాఫీ రకాన్ని బట్టి కిలోకి రూ. 10 నుంచి రూ. 50 మధ్యలో పెంచారు. అంతేకాకుండా ఇంటి వద్దే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇక కాఫీ సేకరించిన డబ్బులను రైతుల ఖాతాల్లో 24 గంటల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతంలో పండే కాఫీ.. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందింది. కాఫీ సాగుకు అనుకూలమైన చల్లని వాతావరణం ఉండటంతో.. మన్యం ప్రాంతంలో కాఫీ సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు డివిజన్ పరిధిలో.. దాదాపు 1.50 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఇక్కడి కాఫీ రైతులు ఏటా సుమారు 17 వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను విక్రయిస్తారు. అయితే కాఫీ గింజల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంటకు సరైన ధర రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాఫీ రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది.2025-26 ఈ ఆర్థిక సంవత్సరానికి కాఫీ కొనుగోలు ధరల్ని పెంచినట్లు గిరిజన సహకార సంస్థ (ఐటీడీఏ) ప్రకటించింది. ఈ మేరకు బుధవారం (నవంబర్ 19) విశాఖలో జరిగిన అపెక్స్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ కాఫీ ధరల్ని దృష్టిలో ఉంచుకుని ధరలను పెంచారు.కాఫీ రకాన్ని బట్టి కొనుగోలు ధరలను పెంచింది గిరిజన సహకార సంస్థ. అందులో భాగంగా కిలోకి రూ. 10 నుంచి రూ. 50 వరకు పెంచారు. కిలో అరెబికా పార్చ్‌మెంట్ కాఫీ రకంపై.. రూ. 450 పెంచారు. ఇక అరెబికా చెర్రీకి రూ. 270, రోబస్టా చెర్రీకి రూ. 170 పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా కాఫీ సేకరణకు ఏజెన్సీలో ఉన్న మారుమూల ప్రాంతాలకూ తమ సిబ్బంది వెళ్తారని జీసీసీ ఎండీ కల్పన కుమారి వెల్లడించడం గమనార్హం.కాఫీ రైతుల ఇంటి వద్దే ఎలక్ట్రానిక్ కాంటాతో కచ్చితమైన తూకంతో పంటను సేకరిస్తామని వివరించారు. అంతేకాకుండా కాఫీ కొనుగోలు చేసిన తర్వాత డబ్బులు.. రైతు బ్యాంకు ఖాతాల్లో 24 గంటల్లో జమ చేస్తామని తెలిపారు. కాగా, తాము ప్రకటించిన ధరల కంటే తక్కువకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ రైతులకు కల్పన కుమారి కోరారు. ఈ మేరకు పెంచిన ధరలపై గిరిజన రైతుల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఇంతకుముందు రైతులు తమ కాఫీ పంటను అమ్మాలంటే.. అరకు, పాడేరు ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటి వద్దే సేకరిస్తే.. రైతులకు వ్యయప్రయాసల నుంచి ఉపశమనం లభిస్తుంది.నాణ్యతలో మేటిగా ఉన్న మన్యం కాఫీ గింజలకు బెంగళూరు కాఫీ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గత సంవత్సరం మన్యం నుంచి పంపిన కాఫీ పాచ్‌మెంట్ గింజలకు.. కిలో రూ. 500 ధరతో వ్యాపారం జరిగినట్లు సమాచారం.

# నవంబర్ లోనే మామిడి జనవరిలోనే తాటి ముంజులు

**విజయవాడ, నవంబర్ 24, పెన్ పవర్::**ఇదేం విచిత్రం.. నవంబర్‌లోనే మామిడి కాయలా.. మార్చిలో రావాల్సినవి ఇప్పుడు దొరుకుతున్నాయంటే నమ్మశక్యంగా లేదు కదూ.. నూజివీడు రసాల కోసం విజయవాడ నుంచి కూడా వ్యాపారులు వస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాతావరణంలో మార్పుల వల్లే ఇలా జరుగుతోందని అంటున్నారు. గత ఏడాదిలాగే ఈసారి కూడా తాటి ముంజలు, మామిడి కాయలు సీజన్‌కు ముందే అందుబాటులోకి రావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గతేడాది కూడా మామిడి, తాటి ముంజలు ముందుగానే వచ్చాయి.

విచిత్రంగా మామిడి కాయలు నవంబర్ నెలలోనే అందుబాటులోకి వచ్చాయి. వాస్తవానికి మార్చి నెలలో మామిడి పంట దిగుబడి వస్తుంది. కానీ నూజివీడు మామిడి పండ్లు ఈ ఏడాది మార్చికి బదులుగా నవంబర్‌లోనే అందుబాటులోకి వచ్చాయి. ఆగిరిపల్లి, వడ్లమాను ప్రాంతాల్లోని కొందరు రైతుల దగ్గర ఈ మామిడి కాయలు దొరకడంతో జనాలు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది వివాహాలు, విందుల్లో ప్రత్యేక వంటకాల కోసం ఈ మామిడిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం కొద్దిమంది రైతుల దగ్గర మాత్రమే ఈ కాయలు ఉండటంతో, ఉమ్మడి జిల్లాలోని చాలామంది కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ నుంచి కూడా వ్యాపారులు నూజివీడు రసాల కోసం వస్తున్నారు.ఆగిరిపల్లికి చెందిన గుండుబోగుల వెంకట రమేశ్ తన స్నేహితుడి కుమారుడి పెళ్లి కోసం మామిడి కాయలు కొనుగోలు చేశారు. 82 కిలోల మామిడిని కిలో రూ.150 చొప్పున కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో ఇదే మామిడి కిలో రూ.10-15కే వస్తుంది. ఈ ఏడాది మామిడి సీజన్ ముందుగానే ప్రారంభం కావడం ఆశ్చర్యంగా ఉంది. వాతావరణంలో మార్పుల వల్ల ఇలా జరిగి ఉండవచ్చు అంటున్నారు. గతేడాది కూడా డిసెంబర్ నెలలోనే మామిడి పండ్లు, తాటి ముంజలు అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా మామిడి పండ్లు, తాటి ముంజలు అందుబాటులోకి వచ్చాయి.ఇటీవల విశాఖపట్నంలో తాటి ముంజలు జనాలకు అందుబాటులోకి వచ్చాయి. కేవలం ఎండాకాలంలో అది కూడా మార్చి తర్వాత దొరికే తాటికాయలు నాలుగైదు నెలల ముందే జనాలకు అందుబాటులోకి వచ్చాయి. నగర శివారు ప్రాంతాలైన భీమిలి, ఆనందపురం, పద్మనాభం ప్రాంతాల నుంచి ఈ తాటికాయల్ని తీసుకొచ్చి.. విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డులోని సీతకొండ దగ్గర తాజాగా విక్రయించారు. జనాలు డజను తాటి ముంజలు రూ.100 చొప్పున కొనుగోలు చేశారు. గతేడాది విజయవాడలో డిసెంబర్ నెలలోనే మామిడి పండ్లు, తాటి ముంజలు విక్రయించారు. ఈ ఏడాది కూడా విజయవాడ, విశాఖపట్నంలో సేమ్ టు సేమ్ అదే పరిస్థితి మళ్లీ రిపీట్ అయ్యింది.

# గోదావరి జిల్లాలపైనే దృష్టంతా

**కాకినాడ, నవంబర్ 24, పెన్ పవర్:**



జనసేన బలోపేతంపై దృష్టి పెట్టారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బలం పెంచుకునేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా కొన్ని ఎంపిక చేసుకున్న జిల్లాల్లో పార్టీని మరింత విస్తృతం చేయాలని చూస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. సుదీర్ఘ పోరాటం తర్వాత ఏపీలో అధికారంలోకి రాగలిగారు. కూటమిలో కీలక భాగస్వామిగా మారారు. అయితే ఇప్పుడే బలపడేందుకు సరైన సమయం అని భావించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి కమిటీ నుంచి జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే గత ఏడాది అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రస్థాయి కమిటీని ప్రకటించారు. అయితే ఈసారి గ్రామ కమిటీలను సైతం ఏర్పాటు చేస్తుండడం విశేషం. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పవన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గడిచిన ఎన్నికల్లో 100 స్ట్రైక్ రేట్ తో జనసేన విజయం సాధించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. నామినేటెడ్ పదవుల్లో సైతం ప్రాతినిధ్యం తగ్గించుకుంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం సత్తా చాటాలని చూస్తోంది. అందుకే గ్రామ, మండల కమిటీలకు ప్రాధాన్యమిస్తోంది. ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయ బృందం వివిధ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు, వీర మహిళలకు సమావేశాలు నిర్వహించింది. క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు, సూచనలను స్వీకరించింది. ఈ డేటాను ఆధారంగా చేసుకుని కమిటీల కూర్పును రూపొందిస్తున్నారు. దిగువ స్థాయి కార్యకర్తల మనోభావాలను సైతం తెలుసుకునే ప్రయత్నం చేశారు.ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖలో జనసేనకు ప్రాతినిధ్యం ఉంది. అందుకే ఈసారి రాయలసీమతో పాటు కోస్తా జిల్లాలపై దృష్టి పెట్టాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ప్రధానంగా ఉమ్మడి పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలపై పవన్ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అక్కడి నాయకత్వాన్ని మరింత పటిష్టం చేసి కార్యక్రమాలను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణుల సహాయం తీసుకోవడమే కాదు.. పార్టీ బలాన్ని విస్తరించడం పై దృష్టి పట్టాలని నిర్ణయించారు. మండల, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పడితే ప్రజల సమస్యలను త్వరగా స్పందించవచ్చని.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే జనసైనికులు జోష్ నింపే వార్త చెప్పారు పవన్ కళ్యాణ్. ఇప్పటివరకు జనసేనకు గ్రామస్థాయిలో కమిటీలు లేవు. అయితే ఈ కమిటీల ద్వారా స్థానిక సంస్థల్లో కొన్ని పదవులు దక్కించుకోవాలన్నది పవన్ ప్లాన్.

# 28న 25 బ్యాంకులకు శంఖుస్థాపన

**విజయవాడ, నవంబర్ 24 పెన్ పవర్:**
అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. భారీగా నిధులు కూడా కేటాయించింది. రోడ్డుతో పాటు రైల్వే ప్రాజెక్టులను సైతం మంజూరు చేసింది. అయితే ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి అమరావతికి ఫుల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టనుంది. రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం తో పాటు ఏకంగా 25 జాతీయ, ప్రైవేటు బ్యాంకులకు సంబంధించిన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈనెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమక్షంలో ఒకేసారి శంకుస్థాపనలు కూడా జరగనున్నాయి. ఇది నిజంగా రికార్డ్. ఒక విధంగా చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం సైతం అమరావతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టే.అమరావతిలో ఆర్బిఐ తోపాటు బ్యాంకులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. అందులో ఓ 12 ఎక్కరాలు రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు అధికారులతో పాటు సిబ్బంది క్వార్టర్స్ కోసం కేటాయించారు. మిగతా ఓ 38 ఎకరాల్లో దేశంలో పేరు మోసిన బ్యాంకులకు సంబంధించిన ప్రాంతీయ కార్యాలయాలు అందుబాటులోకి రానున్నాయి. సాధారణంగా బ్యాంకింగ్ సెక్టార్ అంటేనే కేంద్ర ఆర్థిక శాఖతో కూడుకున్నది. పైగా వాటి నిర్మాణాలు కూడా చాలా వేగంగా జరుపుతారు. వచ్చే రెండేళ్లలో అమరావతిలో ఈ బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అదే జరిగితే ఆర్థిక శాఖ పరంగా కూడా అమరావతి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం ఖాయం.అమరావతి విషయంలో ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్పార్టీ వెనక్కి తగ్గింది. వర్షాలు వచ్చే సమయంలో అమరావతికి వరద పోటు అంటూ ప్రచారం చేసేది. అయితే కేంద్రం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో వైసిపి ఆలోచనలో పడింది. అయితే ఇప్పుడు ఈ ఆర్థిక బ్యాంకులు అందుబాటులోకి వస్తే అమరావతిపై జరిగే వ్యతిరేక ప్రచారానికి చెక్ పడినట్టే. 2014 నుంచి 2018 మధ్య తెలుగుదేశం ఎన్డీఏలో కీలక భాగస్వామి. కానీ ఇటువంటి పరిణామాలేవి అమరావతి విషయంలో జరగలేదు. మునుపెన్నడూ లేని విధంగా అమరావతి విషయంలో కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పుడు ఆర్థిక శాఖకు సంబంధించిన బ్యాంకులు అందుబాటులోకి వస్తే అమరావతి ఆర్థిక రాజధానిగా మిగతా రాష్ట్రాలు గుర్తించడం ఖాయం. ఎందుకంటే ఒకే చోట 25 జాతీయ బ్యాంకులు, వాటి ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటు చిన్న విషయం కాదు. ఈ విషయంలో మాత్రం మిగతా రాజధానుల కంటే అమరావతి మెరుగైన స్థితిలో ఉన్నట్టే.

# కాంగ్రెస్ కు షర్మిళ మాత్రమే...

**విజయవాడ, నవంబర్ 24, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు ఎవరూ కనిపించడం లేదు. కేవలం పార్టీ చీఫ్ వైఎస్ షర్మిల మాత్రమే యాక్టివ్ గా ఉన్నారు. అసలు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లో వైఎస్ షర్మిల కాకుండా మరొక నేత లేరా? అన్న అనుమానం కలుగుతుంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలోపేతం కాదన్న నిరాశ అన్నది తెలియదు. వైఎస్ షర్మిల నాయకత్వంలో పనిచేయడం ఇష్టం లేక కావచ్చు. 2004 నుంచి 2014 వరకూ కేంద్ర మంత్రులుగా, నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రులుగా పనిచేసిన వారు ఇప్పుడు వాయిస్ వినిపించడం లేదు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంపై ఆ పార్టీ అగ్ర నాయకత్వం పోస్ట్ మార్టం చేసుకుంటే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి.. ఇప్పటికే వైఎస్ షర్మిల కాంగ్రెస్ ను ఒక ప్రాంతీయ పార్టీ తరహాలో నడుపుతున్నారన్న టాక్ పార్టీలో ప్రముఖంగా వినిపిస్తుంది. జేడీ శీలం, పల్లంరాజు, రఘువీరారారెడ్డి, చింతా మోహన్ వంటి వారు కూడా బయటకు రావడం లేదు. గతంలో పార్టీ ఓడిపోయినా ఒకింత యాక్టివ్ గా ఉండే వీరు ఇప్పుడు మౌనంగా ఉండటం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. అయితే ఏదైనా పని ఉంటే నేరుగాఢిల్లీకి వెళ తున్నారు తప్పించి వీరు రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా




ఆసక్తిచూపడం లేదు. వైఎస్ ర్మిలను పీసీసీ చీఫ్ చేసిన తర్వాత పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోయిందన్న నివేదికలు పార్టీ నాయకత్వానికి అందినా అంతకు మించిన నాయకత్వం ఎవరూ లేకపోవడంతో హైకమాండ్ కూడా ఏమీ చేయలేకపోతుందంటున్నారు. అన్ని రాష్ట్రాల్లో క్రమంగా పట్టు కోల్పోతున్న కాంగ్రెస్ పార్టీ అసలు ఏమీ లేని రాష్ట్రంలో ఎందుకు చర్యలు తీసుకుంటుందంటున్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ జీరో పెర్ ఫార్మెన్స్ కాంగ్రెస్ పార్టీ చూపించింది. ఇక ఆ పార్టీలో దీర్ఘకాలంగా ఉన్న అనేక మంది నేతలు ఎక్కువ మంది వైసీపీకి,మరికొంత మంది టీడీపీలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు ఉన్న నేతలు లేటు వయసులో పార్టీ మారడం ఎందుకన్న భావనతో ఊరుకున్నారు కానీ, వారు కూడా రాజకీయంగా ఎదగాలని కోరిక ఉంటే పార్టీ ఎప్పుడో మారే వారు. చింతా మోహన్ అప్పడప్పుడు తన వాయిస్ ను వినిపిస్తున్నప్పటికీ ఆయన పెద్దగా రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు.వైఎస్ తనయగా షర్మిల కాంగ్రెస్ పార్టీని ఇంచు కూడా ఎదిగేలా చేయలేకపోయిందన్న విమర్శలు ఆ పార్టీ నుంచే వినిపిస్తున్నాయి.

# మేయర్ పై అవిశ్వాసం...

**నెల్లూరు, నవంబర్ 24, పెన్ పవర్:**
ఏపీలో వైసీపీకి మరో షాక్ తగిలింది. వైసీపీ నేత, నెల్లూరు మేయర్ స్రవంతి మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ఆ దిశగా టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. మేయర్ స్రవంతి అవినీతికి పాల్పడుతున్నారని.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ 40 మంది కార్పొరేటర్లు మంత్రి నారాయణను కలిసి ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో మేయర్ స్రవంతి మీద అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. తీర్మానంపై ఇప్పటికే కార్పొరేటర్లు సంతకాలు చేశారని.. సోమవారం ఎన్నికల అధికారి చేతికి అందించనున్నట్లు తెలిసింది.ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలేలా కనిపిస్తోంది. అధికారం కోల్పోయిన తర్వాత పలువురు నేతలు వైసీపీని వీడి కూటమి పార్టీల్లో చేరిపోయారు. మరికొంతమంది రాజకీయంగా క్రియాశీలకంగా లేరు. ఇక వైసీపీకి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సహా పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు.. కండువాలు మార్చేశారు. దీంతో పలుచోట్ల వైసీపీ మేయర్ పీఠాలను, మున్సిపల్ ఛైర్మన్ పదవులను కోల్పోవాల్సి వచ్చింది. ఆ జాబితాలోకి నెల్లూరు కూడా చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెల్లూరు మేయర్ స్రవంతి మీద అవిశ్వాస తీర్మానం పెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. నెల్లూరు మేయర్ స్రవంతి తీరును తప్పుబడుతూ.. జిల్లాకు చెందిన మంత్రి పొంగూరు నారాయణను 40 మంది కార్పొరేటర్లు కలవడం ఇప్పుడు జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశమైంది.మంత్రి నారాయణను కలిసిన కార్పొరేటర్లు మేయర్ తీరుపై ఆయనకు ఫిర్యాదు చేశారు. మేయర్ స్రవంతి దంపతులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. మేయర్ దంపతులు అవినీతికి పాల్పడుతున్నారని.. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తోందని మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. నెల్లూరుకు కొత్త మేయర్ కావాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కార్పొరేటర్ల వాదనతో మంత్రి నారాయణతో పాటుగా టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా ఏకీభవించినట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో త్వరలోనే నెల్లూరు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే ఆలోచనలో టీడీపీ ఉన్నట్లు తెలుస్తోంది. తీర్మానంపై కార్పొరేటర్లు సంతకాలు చేశారని.. త్వరలో ఎన్నికల అధికారికి ఇవ్వనున్నట్లు సమాచారం.మరోవైపు నెల్లూరు కార్పొరేషన్‌లో మొత్తం 56 డివిజన్లు ఉన్నాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో 56 కార్పొరేటర్ పదవులను వైసీపీ గెలుచుకుంది. అయితే ఆ తర్వాత టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో 29 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరిపోయారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ సహా చాలా మంది కార్పొరేటర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. అయితే మేయర్ స్రవంతి వైసీపీ కావటంతో.. సాంకేతికంగా మేయర్ పీఠం వైసీపీ ఖాతాలో ఉంది. తాజాగా 40 మంది కార్పొరేటర్లు ఆమెకు వ్యతిరేకంగా గళం విప్పటంతో.. మేయర్ పీఠం వైసీపీ చేజారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 93 పరుగులు.. 6 వికెట్లు: టీమిండియాను ఒంటి చేత్తో వెనక్కి నెట్టిన సౌతాఫ్రికా ఆల్ రౌండర్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న రెండో టెస్టులో గత రెండు రోజులు ఒక్క ఆటగాడే హైలెట్ గా నిలిచాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కొరకరాని కొయ్యలా మారి టీమిండియాను డేంజర్ జోన్ లో పడేశాడు. అతడెవరో కాదు సౌతాఫ్రికా బౌలింగ్ ఆల్ రౌండర్ మార్కో జాన్సెన్. రెండో రోజు ఆటలో భాగంగా 93 పరుగులు చేసి సఫారీ భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించిన జాన్సెన్.. మూడో రోజు బౌలింగ్ లో ఏకంగా 6 వికెట్లు పడగొట్టి భారత జట్టును తక్కువ స్కోర్ కే పరిమితమయ్యేలా చేశాడు. ఈ మ్యాచ్ లో సౌతాఫ్రికా గెలిస్తే దానికి ప్రధాన కారణం జాన్సెన్ అనే చెప్పాలి. రెండో రోజు ఆటలో భాగంగా వెర్రెయిన్ వికెట్ తీసి సంతోషంలో మునిగిపోయిన ఇండియాకు జాన్సెన్ దిమ్మ తిరిగే షాక్ ఇచ్చాడు. మరి కాసేపట్లో ఆలౌట్ కావడం గ్యారంటీ అనుకుంటే భారత బౌలర్లను చితక్కొట్టాడు. టెస్టుల్లో వన్డే శైలిలో బ్యాటింగ్ చేస్తూ దుమ్ములేపాడు. కేవలం 91 బంతుల్లోనే 93 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. జాన్సెన్ ఇన్నింగ్స్ లో 6 ఫోర్లతో పాటు ఏకంగా 7 సిక్సర్లున్నాయి. ముత్తుస్వామితో కలిసి 8వ వికెట్ కు 97 పరుగులు జోడించిన జాన్సెన్.. చివరి రెండు వికెట్లను లోయర్ ఆర్డర్ ను పెట్టుకుని 58 పరుగులు రాబట్టాడు. ఇండియాలోని అందరి బౌలర్లను అలవోకగా ఆడి తేన కెరీర్ లో బెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు.

**మూడో రోజు ఆరు వికెట్లు:**

టీమిండియా తొలి ఇన్నింగ్స్ లో జాన్సెన్ ధాటికి పూర్తిగా తేలిపోయింది. తొలి మూడు వికెట్లు సఫారీలకు స్పిన్నర్ల రూపంలో వచ్చాయి. అయితే ఆ తర్వాత ఈ స్టార్ పేసర్ హవా స్టార్ట్ అయింది. పేసర్లకు అంతగా సహకరించని భారత పిచ్ లపై బౌన్సర్లు విసురుతూ మూడో రోజు రెండో సెషన్ లో మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. మొదట పంత్ ను ఔట్ చేసిన ఈ సఫారీ పేసర్ అతి పెద్ద వికెట్ తీసుకున్నాడు. జాన్సెన్ వేసిన బంతిని ముందుకొచ్చి ఆడిన పంత్.. వికెట్ కీపర్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు.జాన్సెన్ వేసిన బౌన్సర్ ను ఆడే క్రమంలో నితీష్ బ్యాట్ ఎడ్జ్ తీసుకొని బంతి గల్లీ వైపుగా వెళ్ళింది. అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న మార్క్రామ్ దూరంగా వెళ్తున్న బంతిని డైవ్ చేస్తూ అందుకున్నాడు. ఇదే ఊపులు ఒక బౌన్సర్ తో జడేజా ను ఔట్ చేయడంతో జాన్సెన్ ధాటికి ఇండియా 122 పరుగుల వద్దకు ఏడో వికెట్ కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత లోయర్ ఆర్డర్ లో కుల్దీప్, బుమ్రా వికెట్లు తీసుకొని ఓవరాల్ గా 6 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తానికి ఓ వైపు బ్యాటింగ్ లో మరోవైపు బౌలింగ్ లో టీమిండియాను ఈ సఫారీ ఆల్ రౌండర్ దెబ్బ కొట్టాడు. గౌహతి వేదికగా జరుగుతున్న ఈ టెస్ట్ విషయానికి వస్తే టీమిండియా పూర్తిగా వెనకపడింది. మూడో రోజు బ్యాటింగ్ లో తేలిపోవడంతో సఫారీలు ఈ టెస్టుపై పట్టు బిగించారు. తొలి ఇన్నింగ్స్ లో 288 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన సౌతాఫ్రికా మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్ లో వికెట్ నష్టపోకుండా 26 పరుగులు చేసింది. ర్యాన్ రికెల్టన్ (13), ఐడెన్ మార్క్రామ్ (12) క్రీజ్ లో ఉన్నారు. ప్రస్తుతం సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ లో 314 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఇప్పటికే ఓటమికి చేరువైన టీమిండియా డ్రా చేసుకోవడం కూడా కష్టంగానే కనిపిస్తోంది.

# ఫైనల్లో సూపర్ ఓవర్ మజా.. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టైటిల్ గెలుచుకున్న పాకిస్థాన్






**హైదరాబాద్ పెన్ పవర్:** మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025 టైటిల్ ను పాకిస్థాన్ ఏ జట్టు గెలుచుకుంది. ఫైనల్లో బంగ్లాదేశ్ ఏ పై సూపర్ ఓవర్ లో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టి ట్రోఫీ అందుకుంది. ఆదివారం (నవంబర్ 23) వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ కూడా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారి తీసింది. సూపర్ ఓవర్ లో బంగ్లాదేశ్ 6 పరుగులు మాత్రమే చేయగలిగింది. 7 పరుగుల లక్ష్యాన్ని పాకిస్థాన్ 4 బంతుల్లో ఛేజ్ చేసి గెలిచింది. ఈ మ్యాచ్ లో ఛేజింగ్ చేస్తున్నప్పుడు బంగ్లాదేశ్ కు చివరి రెండు ఓవర్లలో 27 పరుగులు అవసరం. ఈ దశలో పాక్ విజయం ఖాయమని భావించారు. అయితే షాహిద్ అజీజ్ వేసిన ఇన్నింగ్స్ 19 ఓవర్లో అబ్దుల్ గఫార్ సక్లైన్ 20 పరుగులు రాబట్టి మ్యాచ్ ను బంగ్లా వైపు తిప్పాడు. చివరి ఓవర్లో బంగ్లా విజయానికి 7 పరుగులు కావాల్సి ఉండగా.. అహ్మద్ డానియల్ కేవలం 6 పరుగులే ఇచ్చి మ్యాచ్ ను టై చేశాడు. చివరి బంతికి రెండు పరుగులు కావాల్సి ఉండగా సింగిల్ మాత్రమే వచ్చింది. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారి తీయడంతో పాకిస్థాన్ అలవోక విజయాన్ని సాధించి టైటిల్ తమ ఖాతాలో వేసుకుంది.

ఈ ఫైనల్లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. సాద్ మసూద్ 38 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. అరాఫత్ మిన్హాస్ (25), మాజ్ సదఖత్ (23) రాణించారు. మిగిలిన వారందరూ సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యారు. బంగ్లా బౌలర్లలో రిపాన్ మోండోల్ మూడు వికెట్లు పడగొట్టి పాక్ ను కట్టడి చేశాడు. లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఓపెనర్ హబీబుర్ రెహమాన్ సోహన్ 26 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. పాకిస్థాన్ బౌలర్లలో సుఫియాన్ ముఖీమ్ 4 ఓవర్లలో కేవలం 11 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. అహ్మద్ డానియల్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. మాజ్ సదఖత్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# అఖండ మేకర్స్.. స్ట్రాంగ్ ఓపెనింగ్స్ పై కన్నేశారా?



టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ లీడ్ రోల్ లో నటించిన లేటెస్ట్ మూవీ అఖండ 2: తాండవం. బ్లాక్ బస్టర్ హిట్ అఖండ మూవీకి సీక్వెల్ గా రూపొందుతున్న ఆ సినిమా.. మరికొద్ది రోజుల్లో థియేటర్స్ లో రిలీజ్ కానుంది. పాన్ ఇండియా రేంజ్ లో భారీ అంచనాల మధ్య డిసెంబర్ 5వ తేదీన గ్రాండ్ గా విడుదల అవ్వనుంది.బాలయ్య.. అఖండ సీక్వెల్ తో తాండవం చేయనున్నారని.. ఆడియన్స్ విపరీతంగా అలరించనున్నారని అంతా ఇప్పటికే ఫిక్స్ అయిపోయారు. మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ ను విట్నెస్ చేసిన తర్వాత ఆకాశాన్ని తాకే రేంజ్ లో అంచనాలు పెట్టుకున్నారు. రీసెంట్ గా మేకర్స్ విడుదల చేసిన ట్రైలర్.. అందరినీ ఆకట్టుకుని ఫిదా చేసింది.అయితే ఇప్పుడు అఖండ 2 తాండవం మేకర్స్.. ముందు రోజు ప్రీమియర్స్ వేసే ప్లాన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వార్తలు రాగా.. ఆ విషయంపై ఆల్మోస్ట్ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. రెండు తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 4వ తేదీన పెయిడ్ ప్రీమియర్స్ వేసేందుకు మేకర్స్ సిద్ధమయ్యారని సినీ వర్గాల్లో ఇప్పుడు టాక్ వినిపిస్తోంది.అంటే విడుదలకు ముందు రోజే.. అఖండ సీక్వెల్ మోత మోగనుందని చెప్పాలి. అదే సమయంలో బాలయ్య.. డిసెంబర్ 4వ తేదీ నుంచే తాండవం చేయనున్నారన్న మాట. ఆడియన్స్ అంచనాలను అందుకుని.. ప్రీమియర్స్ నుంచే మూవీకి పాజిటివ్ టాక్ వస్తే ఇక తిరుగులేదు. బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్ లో వసూళ్ల వర్షం కురవడం పక్కా అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అప్పుడు ఓపెనింగ్స్ కూడా స్ట్రాంగ్ గా వస్తాయి.ఆడియన్స్ ను ఆకట్టుకునే విధంగా సినిమాలో కంటెంట్ ఉంటే.. ప్రీమియర్స్ మేకర్స్ కు ప్లస్ పాయింట్ గా మారనున్నాయి. అలా ప్రీమియర్ ద్వారా సాలిడ్ ఓపెనింగ్స్ పై మేకర్స్ కన్నేసినట్లు కనిపిస్తుంది. అయితే ప్రీమియర్స్ కు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి త్వరలో జీవోను మేకర్స్ అందుకోనున్నారని సమాచారం. అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం నుంచి కూడా ఈజీగా జీవో రానుందని టాక్. ఎందుకంటే నైజాంలో దిల్ రాజు.. మూవీని విడుదల చేస్తున్నారు.ఇక సినిమా విషయానికొస్తే.. మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న అఖండ సీక్వెల్ ను 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారు. సంయుక్త మీనన్ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు. ప్రగ్యా జైస్వాల్, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు.



అనుపమ ఫేమ్ నిధి షా స్టైలిష్ ఫోటోలను షేర్ చేసింది



120 బహదూర్ ప్రీమియర్‌లో రాశి ఖన్నా మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptnam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com